

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 307 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం 09, అక్టోబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# రణరంగంగా మారిన ఢిల్లీ







- ప్రజాస్వామ్య రక్షణ కోసం జరుగుతున్న పోరాటం ఉధృతం.
- దేశ ప్రతిపక్ష నేతలపై ఉక్కుపాదం మోపుతున్న కేంద్ర ప్రభుత్వం.
- మొద్దు బారిన తనంతో జవాబుదారుతనాన్ని మరుస్తున్నారు.
- ప్రపంచ చరిత్రలో సుప్రీంకోర్టు న్యాయవాదులు ధర్నాకు దిగడం ప్రప్రదం.
- దేశద్రోహానికి పాల్పడిన ఈసీ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్.
- ప్రపంచ చరిత్రను నివ్వెర పరుస్తున్న ఈసీ అక్రమాలు.
- ఢిల్లీ పోలీసులు మూల్యం చెల్లించుకోక తప్పదు.
- తెలంగాణ పోలీసులను చూసి ఢిల్లీ పోలీసులు సిగ్గు తెచ్చుకోవాలి.
- ఈసీ అక్రమాలపై జరుగుతున్న పోరాటాల్లో ఆంధ్ర ప్రభుత్వం మౌనమేంది.
- యువరాజు పోరాటాన్ని తలపిస్తున్న రాహుల్ గాంధీ.
- దద్దరిల్లుతున్న ధర్నాకు గజ్జుమంటున్న బిజెపి నేతలు.
- హుటాహుటిన ఢిల్లీకి వెళ్లిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.
- డాక్టర్ బరిగెల శివ.

ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యతని డాక్టర్ బరిగెల శివ అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న నిరసనలు ఎన్నికల వ్యవస్థపై నెలకొన్న ఆందోళనలను ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణల్లో పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిర్ణయాలపై వస్తున్న ఆరోపణలకు సమగ్ర వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును పోలీసులు గౌరవించాలని సూచించారు. నిరసనకారులపై బలప్రయోగం జరిగిందన్న ఆరోపణలపై నిష్పాక్షిక విచారణ జరగాలని కోరారు. రాహుల్ గాంధీ సహా ప్రతిపక్ష నాయకుల నిరసనలకు సంబంధించిన పరిణామాలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయని అన్నారు. రాజ్యాంగ విలువలు, ఓటు హక్కు పరిరక్షణ కోసం ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాలు కొనసాగాలని పిలుపునిచ్చారు. - హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



## ఓటు హక్కు ఉన్నవారు.. ఓటు చోరీకి గురైనవారు

దేశాన్ని రెండు వర్గాలుగా విభజిస్తున్నారు: రేవంత్‌రెడ్డి

పేదల ఓట్లు తొలగించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపణ

ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలో పాల్గొన్న తెలంగాణ సీఎం

13 కోట్ల ఓట్లు తొలగిస్తే ప్రపంచంలోనే అతిపెద్ద హక్కుల హరణం

ఓట్ల తర్వాత రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులకూ ముప్పు: హెచ్చరిక

8



## ఎమ్మెల్యే వీడియో వివాదం.. షేర్ చేసిన వారిపై కేసు

విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించారంటూ మల్‌రెడ్డి రంగారెడ్డిపై ఆరోపణలు

సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన బస్సు ఘటన వీడియో

బస్సు మలుపు తిరిగే సమయంలో ప్రమాదవశాత్తూ చేయి తగిలిందన్న యూత్ కాంగ్రెస్

బీఆర్ఎస్ కుట్రగా అభివర్ణిస్తూ పోలీసులకు ఫిర్యాదు

ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు

8



## జూరాల నీళ్లు వదిలిన రైతులపై కేసులు



8

14 మంది రైతులపై పోలీసుల కేసు నమోదు

సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయంటూ రైతుల ఆవేదన

అధికారులు స్పందించకపోవడంతో గేట్లు ఎత్తిన రైతులు

ఇరిగేషన్ డీఈ ఫిర్యాదుతో చర్యలు

నీటి కోసం ధర్నా చేసిన బీఆర్ఎస్, బీజేపీ నేతలపైనా కేసులు

## తెలంగాణలో మళ్లీ మండుతున్న ఎండలు

ఆదిలాబాద్‌లో 37 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

పగటి ఎండలు.. రాత్రివేళ ఉక్కపోతతో ప్రజల ఇబ్బందులు

భద్రాచలం, మహబూబ్‌నగర్‌లో 36.2 డిగ్రీల ఉష్ణోగ్రత

హైదరాబాద్‌లో 35 డిగ్రీలకు చేరిన పగటి ఉష్ణోగ్రత

రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రారంభం

హైదరాబాద్, అక్టోబర్ 8 (నేటి ప్రభాత దర్శిని) :



తెలంగాణలో ఎండల తీవ్రత మళ్లీ పెరుగుతోంది. నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రక్రియ ప్రారంభం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. పగటిపూట ఎండ తీవ్రత, రాత్రివేళల్లో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో గరిష్ఠంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదుకాగా, భద్రాచలం, మహబూబ్‌నగర్‌లో 36.2 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. రాష్ట్రం నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ఇప్పటికే ప్రారంభమైందని వాతావరణ కేంద్రం తెలిపింది. గురువారం ఉత్తర, మధ్య తెలంగాణ ప్రాంతాల నుంచి రుతుపవనాలు వెనుదిరిగాయని, శుక్రవారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా వాటి నిష్క్రమణ పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు వివరించారు. రుతుపవనాల నిష్క్రమణ నేపథ్యంలో రానున్న రోజుల్లోనూ ఎండల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.



# రణరంగంగా మారిన ఢిల్లీ




















**ప్రజాస్వామ్య రక్షణ కోసం జరుగుతున్న పోరాటం ఉధృతం.**
**దేశ ప్రతిపక్ష నేతలపై ఉక్కుపాదం మోపుతున్న కేంద్ర ప్రభుత్వం.**
**మొద్దు బారిన తనంతో జవాబుదారుతనాన్ని మరుస్తున్నారు.**
**ప్రపంచ చరిత్రలో సుప్రీంకోర్టు న్యాయవాదులు ధర్నాకు దిగడం ప్రప్రదం.**
**దేశద్రోహానికి పాల్పడిన ఈసీ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్.**
**ప్రపంచ చరిత్రను నివ్వెర పరుస్తున్న ఈసీ అక్రమాలు.**
**ఢిల్లీ పోలీసులు మూల్యం చెల్లించుకోక తప్పదు.**
**తెలంగాణ పోలీసులను చూసి ఢిల్లీ పోలీసులు సిగ్గు తెచ్చుకోవాలి.**
**ఈసీ అక్రమాలపై జరుగుతున్న పోరాటాల్లో ఆంధ్ర ప్రభుత్వం మౌనమేంది.**
**యువరాజు పోరాటాన్ని తలపిస్తున్న రాహుల్ గాంధీ.**
**దద్దరిల్లుతున్న ధర్నాకు గజ్జుమంటున్న బిజెపి నేతలు.**
**హుటాహుటిన ఢిల్లీకి వెళ్లిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.**
**డాక్టర్ బరిగెల శివ.**

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

ప్రజాస్వామ్య విలువలను రక్షించుకోవాలనే తపన ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని డాక్టర్ బరిగెల శివ అన్నారు.ఢిల్లీ జంతర్ మంతర్ ప్రాంతంలో జరుగుతున్న మహా ధర్నా దేశంలోని అంతర్గత యుద్ధాన్ని తలపెట్టేలా ఉందని అభివర్ణించారు.దేశంలో 2023 నుండి జరుగుతున్న ప్రతి ఎన్నికల్లో జాతీయ ఎన్నికల కమిషన్ ఓట్ చోరీకి పాల్పడిందని ఆధారాలతో సహా బయటకు వచ్చాక జ్ఞానేష్ కుమార్ పై చర్యలు తీసుకోవడానికి ఎలాంటి ఆసక్తి చూపని కేంద్ర ప్రభుత్వం కనీ సానికైనా తనను తప్పించకుండా ఇంతటి మహాధర్నాలు జరుగుతుండగా ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో లక్షల సంఖ్యలో కొత్త ఓట్లను చేర్చడం తెలంగాణలో లక్షల సంఖ్యలో ఓట్లను తొలగించడం లాంటి అక్రమాల పరంపర కొనసాగిస్తూనే ఉన్నాడని ఇంతటి అక్రమాలకు పాల్పడుతున్న ఎంతటి వాడైనా దేశద్రోహిగా పరిగణించాల్సిందేనంటూ దేశ చట్టాలను క్షుణ్ణంగా పరీక్షించి పరిశీలించి అట్టి అక్రమాలకు అనువదింప చేయాల్సి ఉంటుండగా దేశద్రోహన్ని మించి అక్రమాలు జరిగాయని దేశ చట్టాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయన్నారు.ఒకానొక సందర్భంలో సుప్రీంకోర్టు న్యాయవాదుల సంఘం సైతం కేంద్ర ఎన్నికల కమిషన్ పై ధర్నాకు దిగడం ప్రపంచ చరిత్రలో మొట్టమొదటిసారిగా జరుగుతున్న ప్రజాస్వామ్య రక్షణ ఉద్యమంగా భావించాల్సి ఉంటుందని తెలియజేశారు.2023లో జరిగిన ఎన్నికలలో జాతీయ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ సొంతగా నిర్మాణం చేపట్టిన ఓట్ల సవరణ ప్రక్రియ ఫారం 6కు సంబంధించిన అంశాల కూర్పులో ఎక్కడ అనుమతులు పొందుకున్నాడో జాతీయ ఎన్నికల కమిషన్ రికార్డులో గాని కేంద్ర ప్రభుత్వం దగ్గర గాని ఎలాంటి ఆధారాలు లేకపోగా అతిపెద్ద అక్రమ కుంభకోణానికి పాల్పడ్డాడన్న ఆధారాలు ప్రస్తుతం దేశంలో ప్రతి చోట వెలుగులోకి వస్తున్నాయని గుర్తుకు చేశారు. పైగా బఈసీ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఫారం 6 సవరణకు సుప్రీంకోర్టు అనుమతులు ఇచ్చిందంటూ అతిపెద్ద అబద్ధాలు ఆడడం దేశంలో కొత్త రకమైన అబద్ధాల ఆదర్శ పురుషున్ని చూస్తున్నామన్నారు.మరోవైపు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఘం సుప్రీంకోర్టు ధర్మాసనం ఈసీ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ చేపట్టిన ఫారం 6 సవరణకు సుప్రీంకోర్టులో ఎలాంటి అఫీల్ చేయబడలేదని ఏలాంటి అనుమతులు సుప్రీంకోర్టు నుండి మంజూరు చేయబడలేదని స్పష్టంగా వెల్లడిస్తున్నప్పటికిని పదేపదే ఈసీ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అబద్దాలతో కూడిన ప్రకటనలు చేయడం అత్యంత దుర్మార్గం అన్నారు.త్రిసభ్య కమిషనర్లతో కూడిన జాతీయ ఎన్నికల కమిషన్ ప్రస్తుత ఈసి కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఒంటెద్దు పోకడలతో ఏకపక్ష ఆధిపత్యంతో నిర్మిస్తున్న ప్రతి అక్రమాలను హెచ్చరిస్తూ లిఖితపూర్వకంగా ఆక్షేపణలు తెలియజేసినప్పటికిని వాటన్నిటిని పక్కనపెట్టి తన వ్యక్తిగత కార్యాచరణను అమలుపరచడం వెనకాల దేశ ప్రధాని మోడీ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాల సహకారం ప్రోత్సాహం కుట్రలు దాగి ఉన్నాయని స్పష్టంగా అర్థం అవుతుంది అన్నారు.కేవలం మూడు సంవత్సరాల్లోనే ఏకంగా 12సార్లు జ్ఞానేష్ కుమార్ నిర్ణయాలను వ్యతిరేకించిన ఇతర ఇద్దరు కమిషనర్లు లిఖితపూర్వకంగా జ్ఞానేష్ కుమార్ అక్రమాలను నిలదీస్తూ పలుమార్లు లేఖలు రాసినప్పటికిని స్పందించకుండా దేశ భవిష్యత్తును దేశ ప్రజల ఓట్లను సర్వనాశనం చేయడానికి ప్రయత్నం చేసిన జ్ఞానేష్ కుమార్ ను కఠినంగా శిక్షించాల్సిందేనంటూ దేశ ప్రజలు హెచ్చరిస్తున్నారని తెలిపారు.బిజెపికి చెందిన ప్రధాన నేతలే జ్ఞానేష్ కుమార్ ఆగడాలను తీవ్రస్థాయిలో వ్యతిరేకించడం ప్రజాస్వామ్య రక్షణకు అండగా నిలుస్తున్నారన్నది స్పష్టంగా కనిపిస్తుంది అన్నారు.దేశవ్యాప్తంగా చిన్న దేవాలయాలు మొదలుకొని ప్రధాన దేవాలయాల వరకు చివరకు దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన దేవాలయంగా భావిస్తున్న అయోధ్య రామాలయం లాంటి ప్రధాన అర్చకులు దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో బిజెపి పాటిస్తున్న అరాచకాలను తీవ్రస్థాయిలో తిప్పి కొట్టడమే కాకుండా దేశ ప్రజలకు హిందుత్వ విలువలను ఏ విధంగా కాపాడుకోవాలో అవగాహన కల్పిస్తూ హిందూ ధర్మం కుట్రలలో భాగంగా ప్రమాదంలో పడిపోతున్నదని హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలని ఏకంగా రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేసే దుర్మార్గపు పరిస్థితులను బిజెపి ప్రభుత్వం కల్పించడం ప్రపంచ స్థాయిలో జరుగుతున్న మోసం లాంటిది అన్నారు.పైకి హిందుత్వం వాదులుగా నటిస్తూ లోలోపల ప్రజాస్వామ్యాన్ని రాజకీయ విలువలను జాతీయ ఎన్నికల కమిషన్ విలువలను దేశ ప్రజల హక్కులను ప్రజాభివృద్ధిని సర్వనాశనం చేస్తూ రాజ్యాంగ విలువలను పూర్తిస్థాయిలో నిర్మూలించే ప్రయత్నం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం ఆగడాలను కచ్చితంగా కూలదోల్చాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

## ఢిల్లీ ధర్నాపై దాడులు..

ఢిల్లీ పోలీసులు దేశ ప్రజలపై ఏమాత్రం సహనాన్ని పాటించకుండా ఢిల్లీ జంతర్మంతర్ దగ్గర జరుగుతున్న ధర్నాలో పాల్గొంటున్న యువతను ఎంతటి కిరాతకంగా కొడుతున్నారో ప్రపంచంలోని అన్ని దేశాల పోలీసు వ్యవస్థలు పసిగడుతున్నారన్న కనీసానికి కాస్తయినా పరిజ్ఞానం లేకుండా ప్రవర్తించడం బిజెపి అనుబంధ సంస్థలుగా విధులు నిర్వహిస్తున్నట్లు కనిపిస్తుంది అన్నారు.ధర్నా చేస్తున్న విద్యార్థులపై ఇంత కఠినంగా కొట్టే హక్కులు ఢిల్లీ పోలీసులకు ఎవరు కల్పించారో తెలియదు గాని దేశంలో ప్రజాస్వామ్యం ఇంతలా నాశనం చేస్తున్న జ్ఞానేశ్ కుమార్ మోడీ అమిత్ షా లకు కొమ్ము కాసి దేశ భవిష్యత్తును నాశనం చేస్తే భవిష్యత్ తరంలో ఢిల్లీ పోలీసుల కుటుంబ సభ్యులు కూడా ఈ నాశనాన్ని ఆస్వాదించాల్సి అనుభవించాల్సి వస్తుందన్న సంగతిని ఎందుకు మర్చిపోతున్నారు అంటూ హెచ్చరించారు.తీవ్రవాదుల కన్నా దేశద్రోహుల కన్నా సైబర్ నేరగాళ్ల కన్నా ధర్నా చేస్తున్న మేధావులను చిత్రహింసలకు గురి చేయడం ఢిల్లీ పోలీసులకు తగునా అంటూ సూటిగా నిలదీశారు.పరిస్థితులను అదుపులోనికి తీసుకోవడానికి కాస్తంత కఠినత్వాన్ని అరెస్టులను కొనసాగించవచ్చు గాని ఇంతలా కిరాతకంగా దాడులు చేయడం ఇదెక్కడి చట్టమో దేశ ప్రజలకు అర్థం కావడం లేదన్నారు.తెలంగాణ పోలీసులను చూసి సిగ్గు తెచ్చుకోండి అంటూ ఢిల్లీ పోలీసులకు హితువు పలికారు.విద్యార్థినీలను తాకరాని చోట తాకుతూ బలవంతంగా లాక్కెళ్ళుతూ అరెస్టులు చేస్తున్న ఢిల్లీ పోలీసులకు పదోన్నతుల మీద పదోన్నతులు కల్పిస్తూ ఢిల్లీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల పట్ల దేశాన్ని నాశనం చేయాలని పటిష్టమైన ఆలోచనలు పరిపూర్ణంగా కనిపిస్తున్నాయని మండిపడ్డారు.ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ధర్నాలలో పాల్గొనకుండా అడ్డుకునే హక్కు ఢిల్లీ పోలీసులకు ఎవరు ఇచ్చారు అంటూ సూటిగా నిలదీశారు.147 కోట్ల మంది ప్రజలకు ప్రతిపక్ష నేత హోదాలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఏఐసీసీ ప్రధాన నేత రాహుల్ గాంధీని తన సోదరి ప్రియాంక గాంధీని ఇతర విద్యార్థి మేధావులను ఎంత దారుణంగా ఢిల్లీ పోలీసులు లాక్కెలుతూ అక్రమంగా అరెస్టులు చేస్తున్నారో వాటన్నిటిని దేశ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని సంగతిని ఢిల్లీ పోలీసులు గానీ ఢిల్లీ ప్రభుత్వం గానీ ఎందుకు గమనించలేకపోతుందంటూ హెచ్చరించారు.తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా వెళ్లి రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా తన సంఘీభావాన్ని తెలియజేయడానికి ఢిల్లీ జంతర్ మంతర్ ప్రాంతానికి చేరగా సీఎం రేవంత్ ను అడ్డుపడుతూ నిలువరిస్తూ ధర్నా ప్రాంతం వద్దకు వెళ్లకుండా అడ్డుపడిన ఢిల్లీ పోలీసులు ఒక ముఖ్యమంత్రి స్థాయి లాంటి నాయకుడిని ఇలా అడ్డుపడడం సిగ్గుకరమన్నారు.

## ఉద్యమం ఉధృతం గజ్జుమంటు జ్ఞానేష్ కుమార్..

ఢిల్లీ జంతర్మంత ప్రాంతంలో జరుగుతున్న ప్రజాస్వామ్య రక్షణ పోరాటం దేశంలోని అన్ని రాష్ట్రాల్లోనికి పాకిందని అంతేకాకుండా బిజెపి పాలిత ప్రాంతాల్లో కూడా ధర్నా ప్రభావం ఉధృతం దాలుస్తూ దేవాలయాల్లో పూజారులు సైతం బయటకు వచ్చి బిజెపి వ్యతిరేక విధానాలపై ఈసీ కమిషనర్ జ్ఞానేజ్ కుమార్ తీసుకుంటున్న కుట్రపూరితమైన నిర్ణయాలపై వ్యతిరేక ధర్నాలో పాల్గొంటూ నిరసనలు తెలపడం సాక్షాత్తు భగవత్ స్వరూపం దేశంలో జరుగుతున్న అక్రమాలపై పోరాటాలకు సిద్ధం కండని ప్రేరేపించినట్టుగా ఉందన్నారు. ఈసీ కమిషనర్ జ్ఞానేశ్వర్ తన అక్రమాల నుండి తప్పించుకోవడం ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యమయ్యే పని కాదని తెలిసిపోవడంతో తన రక్షణార్థం వ్యక్తిగత భద్రతను పెంచుకొని సుప్రీంకోర్టును శాసిస్తూ జాతీయ ఎన్నికల కమిషన్ ను శాసిస్తూ దేశ ప్రజల జీవితాలను నాశనం చేయడం కోసం పలు రాష్ట్రాల్లో జరగబోయే ఎన్నికల కోసం తన అక్రమాల పరంపరను కొనసాగిస్తూనే దేశ ప్రజలకు దేశం మేధావులకు దేశంలోని శాస్త్రవేత్తలకు దేశంలోని హిందూ పరిరక్షణ రక్షకులకు దేశంలోని అన్ని మతాలకు సవాలు విసురుతూ తన ఆగడాలకు తన అక్రమాలకు అడ్డుకట్ట వేసే నాధుడే ఈ దేశంలో లేడు అనే విధంగా రెచ్చిపోతుండడం పచ్చి మూర్ఖత్వం అన్నారు.జాతీయ ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ బీజేపీ జాతీయ అధ్యక్షులు అభిజిత్ దీప్కే ప్రముఖ నేతలంతా కలిసి జ్ఞానేష్ కుమార్ చేస్తున్న అక్రమాలపై ప్రపంచ దేశాలన్నీ భారతదేశం వైపు చూసే విధంగా ధర్నాలు చేస్తూ నిజాలు వెలుగులోకి రావాలని ఎంతైతే ప్రయత్నం చేస్తున్నారో వాళ్ళ శ్రమ వృధా కాకుండా న్యాయస్థానం సుప్రీంకోర్టు వాళ్లకు అండగా నిలుస్తూ ఈసీ అక్రమాలపై విచారణకు ఆదేశిస్తుండడం దేశ ప్రజల తరఫున బాధ్యత తీసుకున్న విధంగా ఉందన్నారు.ఉద్యమాన్ని ఉధృతం చేసైనా సరే జ్ఞానేశ్ కుమార్ ను గద్దెదించే వరకు జాతీయ ఎన్నికల కమిషనర్ నియామకంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యుడిగా ఉండే అంతవరకు ఉద్యమాలు పోరాటాలు నిరసనలు ఆగవనేది స్పష్టంగా అర్థం అవుతుంది అన్నారు.

# నిశ్శబ్ద విప్లవ వైతాళికుడు పి. మహేంద్రనాథ్

**కలం,చట్టంతో అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన పరిపాలనా రథసారథి**

**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

నినాదాలు లేకుండా.. ఆర్భాటం లేకుండా.. ప్రజల సమస్యలను చట్టబద్ధమైన మార్గంలో పరిష్కరించేందుకు కృషి చేసిన అరుదైన ప్రజానాయకుడిగా పి. మహేంద్రనాథ్ పేరు తెలంగాణ సామాజిక, రాజకీయ చరిత్రలో ప్రత్యేకంగా నిలుస్తుంది. పాలమూరు ప్రాంతంలో సామాజికంగా వెనుకబడిన ప్రజలు భూమి, విద్య, ఉపాధి వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న సమయంలో మహేంద్రనాథ్ వారి సమస్యలను పరిపాలనా వ్యవస్థ ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేశారు. పేదలు తమ సమస్యలను అధికారులకు అర్థమయ్యేలా చెప్పుకోలేని పరిస్థితుల్లో, వారి ఆవేదనను చట్టపరమైన దరఖాస్తుల రూపంలో ప్రభుత్వానికి చేరవేయడం ద్వారా వారికి అండగా నిలిచారు.

### పేదల సమస్యలకు చట్టమే ఆయుధం

భూమి హక్కులు, కౌలు భూములు, ప్రభుత్వ సంక్షేమ పథకాల వంటి అంశాల్లో అణగారిన వర్గాల సమస్యలను పరిష్కరించేందుకు ఆయన పరిపాలనా మార్గాలను వినియోగించారు. ప్రజా సమస్యలను కేవలం రాజకీయ నినాదాలుగా కాకుండా ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలుగా మార్చడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది.

### రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర

పి. మహేంద్రనాథ్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వివిధ దశల్లో మంత్రిగా పనిచేశారు. 1971లో పి.వి. నరసింహారావు నేతృత్వంలోని మంత్రివర్గంలో ఆయన మంత్రిగా ఉన్నట్లు పార్లమెంటరీ రికార్డులు పేర్కొంటున్నాయి. తరువాత ఎన్.టి. రామారావు ప్రభుత్వంలోనూ ఆయన మంత్రిగా పనిచేశారు. 1985––89 కాలంలో అచ్చంపేట నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ రెవెన్యూ, భూ సంస్కరణలు, పౌర సరఫరాలు వంటి శాఖల బాధ్యతలు నిర్వహించినట్లు అందుబాటులో ఉన్న రికార్డులు పేర్కొంటున్నాయి.

### విద్యతోనే శాశ్వత మార్పు

పేదరికాన్ని అధిగమించేందుకు భూమి మాత్రమే కాకుండా విద్య కూడా కీలకమని భావించిన మహేంద్రనాథ్, వెనుకబడిన ప్రాంతాల్లో విద్యా, సంక్షేమ వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చిన నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రజల కోసం పోరాటం అంటే కేవలం వీధుల్లో నినాదాలు చేయడం కాదు.. చట్టాన్ని అర్థం చేసుకోవడం, పరిపాలనా వ్యవస్థను వినియోగించడం, ప్రజల హక్కులను ప్రభుత్వ విధానాలుగా మార్చడం కూడా ఒక సామాజిక పోరాటమే అనే సందేశాన్ని ఆయన రాజకీయ జీవితం అందిస్తుంది.

### నేటి తరానికి స్ఫూర్తిదాయక వారసత్వం

ప్రజల సమస్యలను అధికార వ్యవస్థకు చేరవేసి, వాటికి విధానపరమైన పరిష్కారాలు సాధించేందుకు కృషి చేసిన పి. మహేంద్రనాథ్ జీవితం నేటి ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, యువతకు అధ్యయన అంశంగా నిలుస్తోంది. ఆర్భాటం లేని ఆలోచన.. చట్టబద్ధమైన పోరాటం.. పరిపాలనలో నిర్ణయం.. ప్రజల జీవితాల్లో మార్పు ఇదే పి. మహేంద్రనాథ్ వారసత్వం.





# ఎమ్మెల్యే ఇంట్లోనే ఒక్కటైన శ్రీదేవి-శ్రీకాంత్ ప్రేమజంట









**నాలుగు రోజుల దీక్షకు తెర.. కే.ఆర్. నాగరాజు చొరవతో వివాహం**

**వర్ధన్నపేట, అక్టోబర్ 8 (జై భీమ్ న్యూస్)**

వర్ధన్నపేట నియోజకవర్గంలో కొంతకాలంగా చర్చనీయాంశంగా మారిన శ్రీదేవి--శ్రీకాంత్ ప్రేమ వ్యవహారానికి ఎట్టకేలకు శుభాంతం లభించింది. ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో గురువారం ఆయన స్వగృహంలోనే శ్రీదేవి--శ్రీకాంత్‌ల వివాహం జరిగింది. తమకు న్యాయం చేయాలంటూ శ్రీదేవి గత నాలుగు రోజులుగా చేపట్టిన దీక్షకు మాదిగ సంఘాలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు మద్దతుగా నిలిచారు. రవీందర్ జన్ను రాములు ఆధ్వర్యంలో కొనసాగిన ఉద్యమానికి మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ మద్దతు ప్రకటించి, న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని హామీ ఇచ్చినట్లు మాదిగ సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు స్పందించి ఇరువర్గాలతో మాట్లాడారు. అనంతరం ప్రేమజంట పరస్పర అంగీకారంతో వివాహం చేసుకునేందుకు ముందుకు రావడంతో ఎమ్మెల్యే స్వయంగా తన ఇంట్లోనే వివాహానికి ఏర్పాట్లు చేయించారు. కుటుంబ సభ్యులు, మాదిగ సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరుల సమక్షంలో వివాహం జరిగింది. నాలుగు రోజులుగా కొనసాగిన దీక్షకు వివాహంతో ముగింపు పలికారు. శ్రీదేవి-శ్రీకాంత్‌లు ఒక్కటవడంతో సమస్యకు సామరస్యపూర్వక పరిష్కారం లభించిందని మాదిగ సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు తక్షణమే స్పందించి వివాహం జరిగేలా చొరవ తీసుకోవడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

# హైదరాబాద్‌లో ఇండియా కూటమి 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలో ఉద్రిక్తత.. పలువురు నేతల అరెస్ట్

**హైదరాబాద్‌లో ఇండియా కూటమి 'చలో లోక్‌భవన్' ర్యాలీ.**
**సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్.**
**లోక్‌భవన్ వద్ద పోలీసుల బారికేడ్లు**
**పోలీసులతో నేతలకు తీవ్ర వాగ్వాదం**
**పొన్నం, మహేశ్ గౌడ్ సహా నేతల అరెస్ట్**

**హైదరాబాద్, అక్టోబర్ 8 (జై భీమ్ న్యూస్)**

'సేవ్ డెమోక్రసీ' పేరుతో ఇండీ కూటమి హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఛలో లోక్‌భవన్' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నుంచి లోక్‌భవన్ వరకు కూటమి నేతలు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అజారుద్దీన్, శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. లోక్‌భవన్ వద్దకు ర్యాలీ చేరుకున్న సమయంలో పోలీసులు భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి నేతలను ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, కూటమి నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది. కొంతసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, వేం నరేందర్‌రెడ్డి తదితరులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని డీసీఎంలో తరలించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై ఇండియా కూటమి అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా 'సేవ్ డెమోక్రసీ' కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అక్టోబర్ 2 నుంచి 8 వరకు నిరసనలు చేపట్టాలని కూటమి గతంలో కార్యాచరణ రూపొందించింది. మరోవైపు ఢిల్లీలోనూ ఇండియా కూటమి తదుపరి కార్యాచరణపై దృష్టి పెట్టింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో కూటమి నేతలకు విందు సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో మరో నిరసన చేపట్టే అవకాశం ఉందని సమాచారం.




# గంజాయి సేవిస్తున్న ముగ్గురు అరెస్ట్..

**30 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం**



**మడికొండ, అక్టోబర్ 8 (జై భీమ్ న్యూస్)**

మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. రామన్ హైస్కూల్ సమీపంలోని ఓపెన్ ప్లేస్‌లో కొందరు వ్యక్తులు గంజాయి సేవిస్తున్నారన్న సమాచారంతో మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురు వ్యక్తులు పట్టుబడగా, వారిని విచారించగా వల్లెపు శివరాం, వలబోజు సందీప్, భోగి అరుణ్‌గా గుర్తించారు. వారి వద్ద నుంచి సుమారు 30 గ్రాముల ఎండు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాజీపేట రైల్వే స్టేషన్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి తీసుకొచ్చి రామన్ హైస్కూల్ సమీపంలో సేవిస్తున్న సమయంలో వీరు పోలీసులకు పట్టుబడినట్లు అధికారులు తెలిపారు. నిందితులపై ఎన్.డి.పి.ఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ మాట్లాడుతూ, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆదేశాల మేరకు వరంగల్ ప్రాంతాన్ని డ్రగ్స్ ఫ్రీ జోన్‌గా మార్చే లక్ష్యంతో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. గంజాయి సేవించే వారితో పాటు అక్రమంగా గంజాయిని కొనుగోలు చేసే, విక్రయించే, రవాణా చేసే లేదా తమ ఆధీనంలో ఉంచుకునే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల కేసుల్లో శిక్షలు కూడా కఠినంగా ఉంటాయని పేర్కొన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ నిర్మూలనకు తెలంగాణ పోలీసులు చేస్తున్న పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఇన్‌స్పెక్టర్ పిలుపునిచ్చారు.

# సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలి

**నిర్ణీత గడువులో నిర్మాణం పూర్తి చేయాలి.. నాణ్యతలో రాజీ వద్దు**

**ప్రిన్సిపల్ సెక్రటరీ డా. క్రిస్టినా జెడ్. చూంగ్తు**





**వరంగల్, 8 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను మరింత వేగవంతం చేసి, నిర్ణీత ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డా. క్రిస్టినా జెడ్. చూంగ్తు అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడరాదని స్పష్టం చేశారు. బుధవారం నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రాంగణాన్ని తెలంగాణ ప్రభుత్వ ప్రణాళిక శాఖ కార్యదర్శి, టీజీఆర్ఏసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జనరల్ డా. గౌరవ్ ఉప్పల్‌తో కలిసి డా. క్రిస్టినా జెడ్. చూంగ్తు పరిశీలించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌లతో కలిసి నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేయనున్న వివిధ వైద్య విభాగాలు, రోగులకు అందించాల్సిన సౌకర్యాలు, వైద్యులు--సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులు, అత్యాధునిక వైద్య పరికరాల ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించారు. భవన నిర్మాణం, విభాగాల ఏర్పాటు, మౌలిక వసతులు, వైద్య సేవలకు అవసరమైన సౌకర్యాలు, భవిష్యత్‌లో ఏర్పాటు చేయనున్న వైద్య పరికరాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల ప్రతి దశను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని సూచించారు. నిర్మాణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, ఇంజినీరింగ్ విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వరంగల్, హనుమకొండ జిల్లాలతో పాటు ఉమ్మడి వరంగల్ ప్రాంత ప్రజలకు అత్యున్నత స్థాయి వైద్య సేవలు అందించేలా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని అన్ని హంగులతో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో ఆసుపత్రిలో అవసరమైన మౌలిక వసతులు, ఆధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ పరిశీలనలో డీఎంఈ డా. వాణి, డా. విమల థామస్, ఎంజీఎం సూపరింటెండెంట్ డా. రాంకుమార్, ఆర్ఎంఓ డా. అశ్విన్‌తో పాటు ఆరోగ్య, వైద్య, ఇంజినీరింగ్ శాఖలకు చెందిన సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

# ఆక్రమణలపై ఉక్కుపాదం..

**రహదారుల పరిశుభ్రత, భద్రతకు ప్రాధాన్యం**
**ట్రాఫిక్‌కు ఆటంకంగా ఉన్న బిల్‌బోర్డులు, ఫ్లెక్సీలు, డబ్బాలు తొలగించాలి**
**రహదారుల ఆక్రమణలు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి**
**అధికారులను ఆదేశించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**



**హనుమకొండ, 8 అక్టోబర్ 2026 ( జై భీమ్ న్యూస్)**

నగరంలోని రహదారుల వెంట ఉన్న అక్రమ ఆక్రమణలను తక్షణమే తొలగించి, ప్రజలు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితమైన రాకపోకలు కల్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్నతో కలిసి కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ నగరంలోని కల్లుమండువా కూడలి, చింతగట్టు, రామారం, కాకతీయ విశ్వవిద్యాలయం రెండో గేటు, ప్రధాన రహదారుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రహదారుల పరిస్థితి, ట్రాఫిక్ నిర్వహణ, ఆక్రమణలు, పారిశుద్ధ్య పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రహదారులకు ఇరువైపులా ప్రజలు, వాహనదారుల రాకపోకలకు ఆటంకంగా ఉన్న ప్రకటన బోర్డులు, కటౌట్లు, ఫ్లెక్సీలు, డబ్బాలు తదితర ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలని పట్టణ ప్రణాళిక, విపత్తు నిర్వహణ, ఇంజనీరింగ్ విభాగాల అధికారులను ఆదేశించారు. ఆక్రమణల కారణంగా రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రమాదాలకు అవకాశం ఉన్నందున ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు, వాహనదారులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**పరిశుభ్రతపై నిరంతర పర్యవేక్షణ**

నగరంలోని పారిశుద్ధ్య నిర్వహణను కూడా కలెక్టర్ పరిశీలించారు. ప్రధాన రహదారులు, కూడళ్లు, పరిసర ప్రాంతాల్లో నిత్యం పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. నగర పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న మాట్లాడుతూ రహదారుల వెంట ఉన్న ఆక్రమణలను గుర్తించి తొలగించడంతో పాటు ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజారెడ్డి, పర్యవేక్షణ ఇంజనీర్ రాజ్‌కుమార్, ప్రధాన ఆరోగ్య అధికారి లక్ష్మారెడ్డి, నగర ప్రణాళిక అధికారి రవీందర్ రాడేకర్, జిల్లా అటవీ అధికారి శంకర్ లింగం, కార్యనిర్వహణ ఇంజనీర్ రవికుమార్‌తో పాటు ఇంజనీరింగ్, పారిశుద్ధ్య, పట్టణ ప్రణాళిక, విపత్తు నిర్వహణ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# పరకాలలో బతుకమ్మ ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

**బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులు కల్పించాలి**
**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**





**పరకాల, అక్టోబర్ 8 (జై భీమ్ న్యూస్)**

పరకాల పట్టణంలో నిర్వహించనున్న బతుకమ్మ ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో మహిళలు, ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులను ముందుగానే ఏర్పాటు చేయాలని సూచించారు. బుధవారం పరకాల పట్టణంలోని దామెర చెరువు, అంగడి మైదానం ప్రాంతాల్లో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించనున్న ప్రదేశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బతుకమ్మ ఉత్సవాలు జరిగే ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. చెత్తాచెదారం లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన చోట్ల పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అలాగే బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో తగినంత విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి, రాత్రి వేళల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. ప్రజల రాకపోకలకు అనుగుణంగా అవసరమైన వసతులు కల్పించాలని, ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. బతుకమ్మ పండుగను మహిళలు, ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకునేలా అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. కలెక్టర్ పర్యటనలో పరకాల మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, ఆర్డీవో డీఎస్. వెంకన్న, తహసీల్దార్ విజయలక్ష్మి, కౌన్సిలర్లు బండి శ్రీధర్, అల్లె దశరథం, కుక్కల విజయ్, ఏఈ ప్రవీణ్ కుమార్, టీపీఎస్ రాజ్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత

**జీవితం జీవించడానికే.. కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవాలి: రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్**

**హైద్రాబాద్, అక్టోబర్ 8 (జై భీమ్ న్యూస్)**

జీవితం ఎంతో విలువైనదని, ఆత్మహత్యలకు పాల్పడకుండా కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీవీ ఆనంద్ పిలుపునిచ్చారు. వైఫల్యాలను చూసి కుంగిపోకుండా, ఆత్మస్థైర్యంతో సమస్యలను అధిగమించినప్పుడే మనిషి జీవితంలో పరిపూర్ణత సాధిస్తారని ఆయన అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర పోలీసు కార్యాలయంలో ఆత్మహత్యల నివారణ కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో గత ఏడాది కాలంగా కమిటీ నిర్వహించిన ఆత్మహత్యల నివారణ సదస్సులపై రూపొందించిన సర్వే నివేదికను కమిటీ చైర్మన్, సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ డీజీపీ సీవీ ఆనంద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పోలీసు కుటుంబాల కోసం స్వచ్ఛందంగా ఆత్మహత్యల నివారణపై అవగాహన సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలను మరింత విస్తృతం చేసి రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లోనూ కొనసాగించాలని సూచించారు. ఆత్మహత్యల నివారణలో కుటుంబ సభ్యులు, పోలీసులు, సమాజం సమిష్టిగా బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం డాక్టర్ పరికిపండ్ల అశోక్ రచించిన "నిలిచి గెలిస్తేనే ఘనత" పుస్తకాన్ని డీజీపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్, సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ ఆత్మహత్యకు ప్రయత్నించే వ్యక్తుల పట్ల సమాజం సానుభూతి, స్వాంతనతో వ్యవహరించి మానసిక ధైర్యాన్ని నింపాలని అన్నారు. తనకు ఎవరూ లేరు అనే భావనతో ఒంటరితనంలో కూరుకుపోయే వ్యక్తులకు భరోసా కల్పించడం అత్యంత ముఖ్యమన్నారు. కష్టాల్లో ఉన్న వ్యక్తికి తనకు ఉన్న అన్ని మార్గాలు మూసుకుపోయినట్లు అనిపించినప్పుడు ఆత్మహత్య ఆలోచన తలెత్తుతుందని, అలాంటి ప్రమాదకర సమయంలో మేమున్నాం.. నీకు అండగా ఉంటాం అనే భరోసా కల్పిస్తే వారిని ఆ పరిస్థితి నుంచి బయటకు తీసుకురావచ్చని తెలిపారు. ఆత్మహత్యల నివారణ కేవలం ఒక వ్యక్తి లేదా సంస్థ బాధ్యత కాదని, ఇది మొత్తం సమాజం యొక్క సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మహత్యల నివారణ కమిటీ సభ్యులు సుంకనపల్లి రాజేందర్, డాక్టర్ నోముల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.




# హనుమకొండ జిల్లాలో జాతీయ ఆరోగ్య మిషన్‌లో 51 పోస్టుల భర్తీ

**అక్టోబర్ 15 వరకు దరఖాస్తుల స్వీకరణ**
**జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. ఎ. అప్పయ్య**

**హన్మకొండ, అక్టోబర్ 9 (జై భీమ్ న్యూస్)**



హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 51 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఒప్పంద, పొరుగు సేవల విధానంలో పోస్టులను భర్తీ చేయనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. ఎ. అప్పయ్య తెలిపారు. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నోటిఫికేషన్‌లో భాగంగా శిశు వైద్యులు/వైద్యాధికారులు 4, మానసిక వైద్య నిపుణుడు 1, వైద్యాధికారి 1, మధ్యస్థ స్థాయి ఆరోగ్య ప్రదాతలు/సామాజిక ఆరోగ్య అధికారులు/వైద్యాధికారులు 8, జిల్లా ఎపిడెమియాలజిస్టు 1, ప్రయోగశాల నిర్వాహకుడు 1, సిబ్బంది నర్సులు 12, సహాయక నర్సు మిడ్‌వైఫ్‌లు 16, ప్రయోగశాల సాంకేతిక నిపుణులు 5, ఔషధ విక్రేతలు 2 పోస్టులు ఉన్నాయి. శిశు వైద్యుల పోస్టులకు సంబంధిత వైద్య విద్యార్హతతో పాటు వైద్య మండలి నమోదు తప్పనిసరిగా ఉండాలి. మానసిక వైద్య నిపుణుల పోస్టుకు సంబంధిత విద్యార్హతలు, వైద్యాధికారి పోస్టుకు వైద్య విద్యలో పట్టాతో పాటు వైద్య మండలి నమోదు అవసరమని అధికారులు తెలిపారు. మధ్యస్థ స్థాయి ఆరోగ్య ప్రదాతలు, సామాజిక ఆరోగ్య అధికారులు, వైద్యాధికారుల పోస్టులకు సంబంధిత వైద్య, నర్సింగ్ విద్యార్హతలు, నమోదు అవసరం. జిల్లా ఎపిడెమియాలజిస్టు పోస్టుకు వైద్య విద్యలో పట్టాతో పాటు ప్రజారోగ్యానికి సంబంధించిన ఉన్నత విద్యార్హతలు ఉండాలి. ప్రయోగశాల నిర్వాహకుడి పోస్టుకు సూక్ష్మజీవ శాస్త్రం లేదా జీవరసాయన శాస్త్రంలో పీజీ విద్యార్హతతో పాటు సంబంధిత అనుభవం అవసరమని పేర్కొన్నారు. సిబ్బంది నర్సుల పోస్టులకు సాధారణ నర్సింగ్, మిడ్‌వైఫరీ లేదా బీఎస్సీ నర్సింగ్ విద్యార్హతతో పాటు నర్సింగ్ మండలి నమోదు తప్పనిసరి. సహాయక నర్సు మిడ్‌వైఫ్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు మహిళా బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్త శిక్షణ ఉండాలి. ప్రయోగశాల సాంకేతిక నిపుణుల పోస్టులకు సంబంధిత విద్యార్హత, శిక్షణ, నమోదు అవసరం. ఔషధ విక్రేతల పోస్టులకు ఫార్మసీలో పట్టా లేదా సంబంధిత విద్యార్హత ఉండాలని అధికారులు తెలిపారు. పోస్టును బట్టి నెలవారీ వేతనం రూ.27,300 నుంచి రూ.1,00,000 వరకు ఉంటుంది. శిశు వైద్యుల పోస్టులకు రూ.1,00,000, వైద్యాధికారికి రూ.52,000, జిల్లా ఎపిడెమియాలజిస్టుకు రూ.50,000, ప్రయోగశాల నిర్వాహకుడికి రూ.30,000, సిబ్బంది నర్సులకు రూ.29,900, సహాయక నర్సు మిడ్‌వైఫ్‌లు, ప్రయోగశాల సాంకేతిక నిపుణులు, ఔషధ విక్రేతలకు రూ.27,300 చొప్పున వేతనం నిర్ణయించారు. దరఖాస్తుల స్వీకరణ అక్టోబర్ 8న ప్రారంభమై, అక్టోబర్ 15వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో కార్యాలయ పనివేళల్లో మాత్రమే దరఖాస్తులను స్వీకరిస్తామని అధికారులు స్పష్టం చేశారు. నిర్ణీత గడువు అనంతరం వచ్చే దరఖాస్తులను స్వీకరించబోమని తెలిపారు. అభ్యర్థులు పోస్టుల వారీగా విద్యార్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్లు, అనుభవం, వేతనం తదితర వివరాలను పరిశీలించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పోస్టుల ఖాళీలు, విద్యార్హతలు, దరఖాస్తు విధానం తదితర పూర్తి వివరాలను హనుమకొండ జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నియామకాలకు సంబంధించి సందేహాలు ఉంటే హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయ పరిపాలనా అధికారిని లేదా 9177455806 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. ఎ. అప్పయ్య సూచించారు.

# క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్ట నిబంధనలు పాటించాలి

**ప్రైవేట్ ఆసుపత్రుల్లో డీఎంహెచ్‌ఓ డా. అప్పయ్య తనిఖీలు**






**హన్మకొండ, అక్టోబర్ 8(జై భీమ్ న్యూస్)**

జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ కేంద్రాలు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. అప్పయ్య సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు రోగులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలని తెలిపారు. గురువారం హనుమకొండ పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను డీఎంహెచ్‌ఓ డా. అప్పయ్య తనిఖీ చేశారు. యూరోకేర్ హాస్పిటల్, శాంతి సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్, డా. సుమన్ కిడ్నీ అండ్ ఆండ్రో కేర్ హాస్పిటల్, వేద హాస్పిటళ్లను సందర్శించారు. ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, వైద్యులు, సిబ్బంది వివరాలు, రికార్డుల నిర్వహణ, పరిశుభ్రత, రోగుల భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డా. అప్పయ్య మాట్లాడుతూ ప్రతి ప్రైవేట్ వైద్య సంస్థ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం కింద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. వైద్యులు, పారామెడికల్ సిబ్బంది అర్హతలు, వైద్య పరికరాలు, అత్యవసర సేవలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, రోగుల వైద్య రికార్డుల నిర్వహణ తదితర అంశాల్లో ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను పాటించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వైద్య సంస్థలపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ కేంద్రాలపై తనిఖీలు, పర్యవేక్షణ నిరంతరం కొనసాగుతాయని డీఎంహెచ్‌ఓ డా. అప్పయ్య తెలిపారు.

# కాళేశ్వరంలో చెత్త చూసి షాకైన టాలీవుడ్ డైరెక్టర్.. వైరల్‌గా మారిన పోస్ట్

**హైదరాబాద్, అక్టోబర్ 8 (జై భీమ్ న్యూస్)**

కాళేశ్వరం వద్ద పేరుకుపోయిన చెత్తపై టాలీవుడ్ దర్శకుడు వేణు ఉడుగుల ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన వీడియోను 'ఎక్స్'లో షేర్ చేశారు. కాళేశ్వరం పరిస్థితిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'మన కాళేశ్వరం.. దక్షిణ భారత త్రివేణి సంగమం కాదా?' అంటూ ప్రశ్నించారు. అంతటి పవిత్ర ప్రదేశం దుర్వాసనతో ఒక్క క్షణం కూడా నిలబడలేని స్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం పరిశుభ్రత లేకపోవడం మాత్రమే సమస్య కాదని అన్నారు. ఇది పరిపాలన, జవాబుదారీతనానికి సంబంధించిన అంశమని పేర్కొన్నారు. 'భక్తి అనేది వ్యక్తిగతం. కానీ నది ప్రజలందరిదీ' అని వేణు ఉడుగుల అన్నారు. కాళేశ్వరం ప్రస్తుత పరిస్థితికి గత ప్రభుత్వాలను నిందించడం సరికాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం దీనిపై బాధ్యత తీసుకోవాలని సూచించారు. వేణు ఉడుగుల పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాళేశ్వరం ప్రాంతాన్ని వెంటనే శుభ్రం చేయాలని నెటిజన్లు కోరుతున్నారు. పవిత్ర ప్రదేశాల పరిశుభ్రతపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. వేణు ఉడుగుల 'నీది నాది ఒకే కథ' సినిమాతో దర్శకుడిగా టాలీవుడ్‌కు పరిచయమయ్యారు. ఆ తర్వాత రానా దగ్గుబాటి హీరోగా 'విరాటపర్వం' తెరకెక్కించారు. సినిమాలతో పాటు సామాజిక, రాజకీయ అంశాలపై కూడా ఆయన తరచూ తన అభిప్రాయాలను వెల్లడిస్తుంటారు.

# టిబిపై సమరమే..

## ప్రతి గ్రామం టిబి రహితంగా మారాలి!





### యువత, ఎన్‌సీసీ క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు ముందుకు రావాలి

### కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, 8 అక్టోబర్ 2026 ( జై భీమ్ న్యూస్)**

టిబి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యమే కీలకమని, ప్రతి గ్రామాన్ని టిబి రహిత గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో యువత ముందుండాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిలుపునిచ్చారు. టిబి ముక్త్ భారత్ లక్ష్య సాధనలో యువత, ఎన్‌సీసీ క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన 'టిబి ముక్త్ భారత్--ఆయుష్మాన్ కోసం జోష్ టీముల' కార్యక్రమాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం జరిగిన అవగాహన కార్యక్రమంలో టిబి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు, యువతకు దిశానిర్దేశం చేశారు.

#### రెండు వారాల దగ్గును నిర్లక్ష్యం చేయొద్దు

క్షయ వ్యాధి బ్యాక్టీరియా వల్ల కలిగే అంటువ్యాధి అని, ప్రధానంగా గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని కలెక్టర్ తెలిపారు. చికిత్స పొందని టిబి బాధితులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వెలువడే సూక్ష్మక్రిముల ద్వారా ఇతరులకు వ్యాధి సోకే అవకాశం ఉంటుందని వివరించారు.రెండు వారాలకు మించి తగ్గని దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి కఫ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అవసరమైన వారికి వైద్యుల సూచన మేరకు ఛాతీ ఎక్స్‌రే తదితర పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారించాలని సూచించారు. టిబి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా అందించే చికిత్సను వైద్యుల సూచనల మేరకు పూర్తిగా తీసుకుంటే వ్యాధి నయం అవుతుందని తెలిపారు.

#### మందులు మధ్యలో ఆపితే ప్రమాదమే

డ్రగ్ రెసిస్టెంట్ టిబిపై ప్రత్యేక అప్రమత్తత అవసరమని కలెక్టర్ హెచ్చరించారు. వైద్యులు సూచించిన మందులను నిర్ణీత మోతాదులో, నిర్దేశించిన కాలం పాటు తీసుకోకుండా మధ్యలో నిలిపివేస్తే ఔషధ నిరోధకత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు.డ్రగ్ రెసిస్టెంట్ టిబి బాధితులు వైద్యుల సూచనలను కచ్చితంగా పాటిస్తూ చికిత్సను పూర్తిచేయాలని సూచించారు.

#### గ్రామాల్లో యువత కీలక పాత్ర

టిబి నిర్మూలనలో గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ అన్నారు. జోష్ టీములు, ఎన్‌సీసీ క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు, యువత గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజలకు టిబిపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో టిబి స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించి అనుమానిత కేసులను గుర్తించడం, పరీక్షలు చేయించడం, వ్యాధి నిర్ధారణ అయిన వారికి సకాలంలో చికిత్స అందేలా చూడాలని ఆదేశించారు. ప్రతి గ్రామాన్ని టిబి రహిత గ్రామంగా మార్చేందుకు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, యువత, ఎన్‌సీసీ క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు, ప్రభావశీల వ్యక్తులు సమష్టిగా పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఆరోగ్యశాఖతో పాటు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వరంగల్ జిల్లాను టిబి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు.

#### టిబి రహిత గ్రామాల సర్పంచులకు ఘన సన్మానం

టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో టిబి రహిత గ్రామాలుగా గుర్తించబడిన గ్రామాల సర్పంచులను కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి సన్మానించారు. శాలువాలతో సత్కరించి టిబి ముక్త్ భారత్ గ్రామాల సర్టిఫికెట్లను అందజేశారు. చాపలబండ సర్పంచ్ ఆలేటి పశు, దేశాయిపల్లి సర్పంచ్ ఉత్తరేణి భాగ్యలక్ష్మి, చెన్నారం సర్పంచ్ సింధం లలిత, కాశిగూడెం సర్పంచ్ పటాన్ రాజాక్, లోహిత సర్పంచ్ బొమ్మ నాగేష్‌లకు సర్టిఫికెట్లు అందజేశారు. నల్లబెల్లి సర్పంచ్ జక్క అనిత తరఫున ఎంపీడీవో వెంకట రమణ సర్టిఫికెట్ అందుకున్నారు.అనంతరం టిబి నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి, నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యా రాణి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఐ. ప్రకాష్, డాక్టర్ ఆర్. రాజమౌళి, డాక్టర్ సాజిదా అతహరి, డాక్టర్ అరుణ్ జోషి, డిప్యూటీ డెమో ఎస్. వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రత్యేక అధికారులు, టిబి రహిత గ్రామాల సర్పంచులు, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎన్‌సీసీ కమాండర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు, పాల్గొన్నారు

# రాహుల్, ప్రియాంక గాంధీ అరెస్టులను తీవ్రంగా ఖండించిన రాజనాల శ్రీహరి

### ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పోరాటం చేస్తోంది..

### ఓటు చోరీ ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి

**వరంగల్,8 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**



కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టులను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజనాల శ్రీహరి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై కేంద్ర ఎన్నికల సంఘం సమగ్ర విచారణ జరిపి నిజానిజాలను ప్రజల ముందుంచాలని ఆయన డిమాండ్ చేశారు.ఢిల్లీలో ఓటర్ల జాబితాకు సంబంధించిన అంశాలపై కాంగ్రెస్ నాయకులు చేపట్టిన ఆందోళనలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ పాల్గొన్న సమయంలో వారిని అరెస్టు చేయడాన్ని రాజనాల శ్రీహరి తప్పుబట్టారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులపై అరెస్టులు, కఠిన చర్యలు తీసుకోవడం సరైన విధానం కాదని పేర్కొన్నారు.బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కొన్ని విధానాల వల్ల దేశంలో ఓటర్ల హక్కులకు నష్టం కలుగుతోందని కాంగ్రెస్ ఆరోపిస్తోందని, ముఖ్యంగా ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు, చేర్పుల విషయంలో పారదర్శకత అవసరమని రాజనాల శ్రీహరి అన్నారు.

#### బతికున్న వారి పేర్లు తొలగిస్తున్నారన్న ఆరోపణలు

బతికున్న వ్యక్తుల పేర్లు ఓటర్ల జాబితా నుంచి తొలగించడం, భార్య పేర్లు ఉండగా భర్త పేర్లు లేదా కుటుంబ సభ్యుల పేర్లు తొలగించడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. హైదరాబాద్ శంషాబాద్ ప్రాంతంలో 31 కుటుంబాలకు చెందిన కాంగ్రెస్ అనుకూల ఓట్లను తొలగించేందుకు కుట్ర జరిగిందన్న ఆరోపణలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. అయితే ఇలాంటి ఆరోపణలపై సంబంధిత ఎన్నికల అధికారులు సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని ఆయన కోరారు.

#### వరంగల్ జిల్లాలోనూ ఓట్ల తొలగింపుపై ఆందోళన

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ముస్లిం, దళిత కాలనీలు, బంజారా తండాలను లక్ష్యంగా చేసుకుని ఓట్ల తొలగింపు జరుగుతోందని రాజనాల శ్రీహరి ఆరోపించారు. గత మూడు నెలల్లో సుమారు 13 వేల ఓట్లు తొలగించారన్న సమాచారం ఉందని, ఈ విషయంపై ఎన్నికల అధికారులు పారదర్శకంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితాలో పేర్లు తొలగించే ముందు సంబంధిత వ్యక్తులకు సమాచారం ఇవ్వడం, అభ్యంతరాలు స్వీకరించడం, నిబంధనల ప్రకారం విచారణ నిర్వహించడం వంటి ప్రక్రియలను కచ్చితంగా పాటించాలని ఆయన కోరారు.

#### ఓటు హక్కు రక్షణకు పోరాటం

ప్రజాస్వామ్యానికి ఓటు హక్కే పునాది అని రాజనాల శ్రీహరి అన్నారు. ఏ పార్టీకి అనుకూలంగా లేదా ప్రతికూలంగా కాకుండా, ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు హక్కును ఎన్నికల వ్యవస్థ రక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని వచ్చిన ఆరోపణలను కేంద్ర ఎన్నికల సంఘం తీవ్రంగా పరిగణించి, స్వతంత్రంగా విచారణ జరిపి నిజానిజాలను వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయంగా తొలగించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున తన పోరాటాన్ని కొనసాగిస్తుందని రాజనాల శ్రీహరి స్పష్టం చేశారు.

# 16 పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ పాఠశాలలకు స్కిల్ మెటీరియల్ సరఫరాకు సీల్డ్ కొటేషన్ల ఆహ్వానం

**వరంగల్, అక్టోబర్ 8 (జై భీమ్ న్యూస్)**

2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి వరంగల్ జిల్లాలోని 16 పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ (పీఎం శ్రీ) పాఠశాలలకు అవసరమైన స్కిల్ మెటీరియల్, ఆట వస్తువులను సరఫరా చేసేందుకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం సీల్డ్ కొటేషన్లను ఆహ్వానించింది. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడంతో పాటు వారి శారీరక సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు అవసరమైన నాణ్యమైన ఆట వస్తువులు, స్కిల్ మెటీరియల్‌ను సరఫరా చేయాలని అధికారులు సూచించారు. అర్హత కలిగిన సరఫరాదారులు తమ కొటేషన్లను 2026 అక్టోబర్ 9 నుంచి అక్టోబర్ 13వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు సమర్పించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం తెలిపింది. అనంతరం సీల్డ్ టెండర్ పత్రాలను అక్టోబర్ 13వ తేదీ సాయంత్రం 3 గంటలలోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, వరంగల్‌లో సమర్పించాల్సి ఉంటుందని పేర్కొంది. సమర్పించిన సీల్డ్ టెండర్లను అక్టోబర్ 14, 2026న జిల్లా కలెక్టర్ కార్యాలయం, వరంగల్‌లో తెరవనున్నట్లు అధికారులు వెల్లడించారు. స్కిల్ మెటీరియల్, ఆట వస్తువుల సరఫరాలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా వస్తువులను అందించాలని అధికారులు స్పష్టం చేశారు. టెండర్లకు సంబంధించిన ఇతర నిబంధనలు, అర్హతలు, అవసరమైన మెటీరియల్ వివరాలు తదితర సమాచారం కోసం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. పీఎం శ్రీ పాఠశాలల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు 21వ శతాబ్దపు నైపుణ్యాలు, క్రీడలు, కళలు, ఐసిటి తదితర రంగాల్లో మెరుగైన అవకాశాలను కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలలకు అవసరమైన స్కిల్ మెటీరియల్, క్రీడా సామగ్రి అందుబాటులోకి రావడం ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి మరింత ప్రోత్సాహం లభించనుంది.

# 'మీ ప్రమాణం' యాప్‌తో ఉద్యోగుల హాజరు నమోదు చేయాలి






### సమయపాలన, పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడమే లక్ష్యం

**ములుగు, అక్టోబర్ 8 (జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ ఉద్యోగుల సమయపాలన, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు ప్రవేశపెట్టిన 'మీ ప్రమాణం' యాప్ ద్వారా అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు నమోదు చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సిహెచ్. మహేందర్ జి సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో వివిధ శాఖల నోడల్ అధికారులు, ఉద్యోగులకు 'మీ ప్రమాణం' యాప్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాప్‌లో ఉద్యోగుల వివరాల నమోదు, ముఖగుర్తింపు ద్వారా హాజరు నమోదు, కార్యాలయ స్థాన నిర్ధారణ తదితర అంశాలపై అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించేందుకు ఉద్యోగుల సమయపాలన ఎంతో కీలకమని అన్నారు. జిల్లా స్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు విధులు నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు 'మీ ప్రమాణం' యాప్ వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రెగ్యులర్, కాంట్రాక్టు, పొరుగు సేవల ఉద్యోగుల వివరాలను సంబంధిత శాఖల నోడల్ అధికారులు త్వరితగతిన నమోదు చేయాలని ఆదేశించారు. ఉద్యోగులు తమ చరవాణిలోని 'మీ ప్రమాణం' యాప్ ద్వారా ముఖగుర్తింపుతో హాజరు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఉద్యోగి గుర్తింపుతో పాటు హాజరు నమోదు చేస్తున్న ప్రదేశాన్ని ధ్రువీకరించే సదుపాయం కూడా యాప్‌లో ఉందన్నారు. ఉద్యోగులు కార్యాలయానికి చేరుకున్న సమయంలో, విధులు ముగించుకుని వెళ్లే సమయంలో నిర్దేశిత విధానం ప్రకారం హాజరు నమోదు చేయాలని సూచించారు. ముఖగుర్తింపు, కార్యాలయ స్థాన నిర్ధారణ విధానాల ద్వారా ఇతరుల తరఫున హాజరు నమోదు చేసే అవకాశాన్ని నివారించవచ్చని అదనపు కలెక్టర్ తెలిపారు. శాఖాధిపతులు తమ పరిధిలోని ఉద్యోగుల హాజరు వివరాలను పర్యవేక్షించడంతో పాటు హాజరు నివేదికలను పరిశీలించే అవకాశం యాప్‌లో ఉందన్నారు. ఉద్యోగులు కార్యాలయ వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సేవలను సకాలంలో అందించాలని సూచించారు. యాప్‌లో ఉద్యోగుల పేర్లు, ఉద్యోగ గుర్తింపు సంఖ్య, శాఖ, హోదా, చరవాణి సంఖ్య తదితర వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని తెలిపారు. నమోదు, ముఖగుర్తింపు లేదా హాజరు ప్రక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తితే సంబంధిత నోడల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సందేహాల నివృత్తి కోసం 'మీ ప్రమాణం' యాప్ జిల్లా నోడల్ అధికారి, ఈడీఎం దేవేందర్ను సంప్రదించాలని తెలిపారు. అనంతరం హైదరాబాద్ నుంచి వచ్చిన సాంకేతిక బృందం ప్రతినిధులు యాప్‌లో ఉద్యోగుల వివరాలు నమోదు చేసుకునే విధానం, ముఖగుర్తింపు ద్వారా హాజరు నమోదు, కార్యాలయ స్థాన నిర్ధారణ తదితర అంశాలను ప్రత్యక్షంగా వివరించారు. ఉద్యోగులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, ఐటీడీఏ ఎస్‌డీసీ ప్రతాప్, 'మీ ప్రమాణం' యాప్ నోడల్ అధికారి ఈడీఎం దేవేందర్, హైదరాబాద్ సాంకేతిక బృందం ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ ఎన్టీఆర్ అభిమానులపై సీపీ సజ్జనార్ ఆగ్రహం..

### తన ఫొటోను మార్ఫ్ చేశారంటూ ఎన్టీఆర్ ఫ్యాన్స్‌పై సజ్జనార్ అసంతృప్తి

### సోషల్ మీడియాలో వైరల్ అయిన ఫొటో ఏఐ సృష్టించిన ఫేక్ అని స్పష్టీకరణ

### ఈ విషయాన్ని గమనించాలంటూ నటుడు ఎన్టీఆర్‌ను ట్యాగ్ చేసిన వైనం

### నిజనిజాలు తెలుసుకోకుండా కంటెంట్‌ను ఫార్వర్డ్ చేయవద్దని నెటిజన్లకు విజ్ఞప్తి

### చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

**హైదరాబాద్, అక్టోబర్ 8 (జై భీమ్ న్యూస్)**

జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల తీరుపై పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తన ఫొటోను మార్ఫింగ్ చేసి, ఒక ఫేక్ చిత్రాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ విషయాన్ని నేరుగా నటుడు జూనియర్ ఎన్టీఆర్ దృష్టికి తీసుకెళ్తూ ఆయన అధికారిక 'ఎక్స్' ఖాతాను ట్యాగ్ చేయడం గమనార్హం. ఇటీవల 'చుట్టమల్లే' పాట వివాదానికి సంబంధించి ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు 'సౌత్ డిజిటల్ మీడియా' అనే ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ ప్రత్యక్షమైంది. దీనికి జత చేసిన ఫొటోలో, ఒక వ్యక్తికి ముసుగు వేసి ఉండగా, ఆయన పక్కన పోలీసులు, కొందరు ఎన్టీఆర్ అభిమానులు ఉన్నట్లు కనిపించింది. ఈ ఫొటోలో కమిషనర్ సజ్జనార్ చిత్రం కూడా ఉంది. ఇది కొద్దిసేపట్లోనే వైరల్ కావడంతో సజ్జనార్ స్పందించారు. వైరల్ అవుతున్న ఆ ఫొటో నిజమైనది కాదని, అది పూర్తిగా ఏఐతో సృష్టించిన డీప్‌ఫేక్ చిత్రమని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి ఫేక్ కంటెంట్‌ను చూసి మోసపోవద్దని, వాస్తవాలను నిర్ధారించుకోకుండా ఫార్వర్డ్ చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్‌లో కనిపించే ప్రతీదాన్ని గుడ్డిగా నమ్మవద్దని సూచించారు. ఈ ఫేక్ ఫొటోను కొందరు ఎన్టీఆర్ అభిమానులే ప్రచారంలోకి తెచ్చినట్లు గుర్తించిన సజ్జనార్.. "మీ అభిమానుల్లో కొందరు నా ఫొటోను ఈ విధంగా దుర్వినియోగం చేస్తున్న అంశాన్ని దయచేసి గమనించండి" అంటూ జూనియర్ ఎన్టీఆర్‌ను ట్యాగ్ చేస్తూ కోరారు. సైబర్ నేరాలు, డీప్‌ఫేక్‌లపై నిరంతరం ప్రజలను అప్రమత్తం చేసే సజ్జనార్ స్వయంగా ఇలాంటి ఫేక్ ప్రచారానికి గురికావడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. ఏఐని ఆయుధంగా వాడుతూ తప్పుడు ప్రచారం చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# లంచం డిమాండ్.. సీఐ, ఎస్సై, కానిస్టేబుల్ సస్పెన్షన్

**జేసీబీలు, ట్రాక్టర్ల విడుదలకు రూ.లక్ష డిమాండ్.. రూ.50 వేల వద్ద బేరం**
**కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లో పోలీసులపై చర్యలు**

**కరీంనగర్, అక్టోబర్ 8 (జై భీమ్ న్యూస్)**

లంచం డిమాండ్ చేసి వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలపై కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన సీఐ, ఎస్సై, కానిస్టేబుల్‌పై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. జేసీబీలు, ట్రాక్టర్లను విడుదల చేసేందుకు భారీగా లంచం డిమాండ్ చేసి వసూలు చేసినట్లు విచారణలో తేలడంతో తిమ్మాపూర్ సీఐ బొల్లం రమేశ్, ఎస్సై అన్వర్‌తో పాటు ఓ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్--1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ పోలీసుల ఆధీనంలో ఉన్న జేసీబీలు, ట్రాక్టర్లను విడుదల చేసేందుకు సంబంధిత వ్యక్తులు చలానాలు చెల్లించడంతో పాటు తహశీల్దార్ నుంచి అవసరమైన ఉత్తర్వులు కూడా తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఆ ఉత్తర్వులు సమర్పించినప్పటికీ వాహనాలను విడుదల చేయకుండా పోలీసులు జాప్యం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. వాహనాల విడుదల కోసం రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం రూ.50 వేల వద్ద బేరం కుదుర్చుకుని ఆ మొత్తాన్ని వసూలు చేసేందుకు ప్రయత్నించినట్లు అధికారులు నిర్వహించిన విచారణలో తేలినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో సీఐ, ఎస్సైతో పాటు కానిస్టేబుల్ పాత్ర ఉన్నట్లు నిర్ధారణ కావడంతో వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. పోలీస్ శాఖలో అవినీతి, లంచాల వ్యవహారాలను ఏమాత్రం ఉపేక్షించబోమని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్న నేపథ్యంలో ఈ సస్పెన్షన్ చర్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రజలకు సేవలందించాల్సిన పోలీసు అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవనే సంకేతాన్ని ఈ ఘటన ద్వారా ఉన్నతాధికారులు ఇచ్చినట్లయింది. వాహనాల విడుదల విషయంలో లంచం డిమాండ్ చేసి, బేరసారాలకు పాల్పడినట్లు విచారణలో నిర్ధారణ కావడంతో ముగ్గురు పోలీసు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ ఘటనపై పోలీసు శాఖలో మరింత విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం.

# పేదింటి ఆడపడుచులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వరం





**వరంగల్, 8 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

పేదింటి ఆడపడుచుల వివాహాలకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను అమలు చేస్తోందని మాజీ మంత్రి కొండా సురేఖ అన్నారు.వరంగల్ 21వ డివిజన్‌లోని ఏ1 ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 264 మంది లబ్ధిదారులకు రూ.2 కోట్ల 64 లక్షల 30 వేల 624 విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను కొండా సురేఖ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సమాన న్యాయం, నిరుపేద కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధి రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, రూ.500కే గ్యాస్ సిలిండర్, పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు. అర్హులైన కుటుంబాలకు నూతన రేషన్ కార్డులు అందజేస్తున్నామని, రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. అర్హులైన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కొండా సురేఖ పేర్కొన్నారు.

# కారు ఢీకొని దంపతులకు తీవ్ర గాయాలు

**హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు**

**హసన్‌పర్తి, అక్టోబర్ 8 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో దంపతులు తీవ్రంగా గాయపడిన సంఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం ఎలుకుర్తి గ్రామానికి చెందిన మంద రమేష్ (47), ఆయన భార్య జ్యోతి అక్టోబర్ 7వ తేదీ మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై వరంగల్ నుంచి వంగపహాడ్ వైపు వెళ్తున్నారు. వంగపహాడ్ గ్రామ సమీపంలోని రింగురోడ్డు వద్దకు చేరుకోగానే ఎదురుగా అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన కారు వారి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం తీవ్రంగా దెబ్బతినగా, రమేష్‌కు కుడికాలు విరిగి, కడుపులో బలమైన గాయాలు అయ్యాయి. ఆయన భార్య జ్యోతికి కుడిచేతికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆరెపల్లి రోడ్డులోని ఎన్ఎస్ఆర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. బాధితుల కుమారుడు మంద విశ్వాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు నడిపిన నట్టి రాజమౌళి (68)పై హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ ఆదేశాల మేరకు పోలీసులు ప్రమాదానికి గల కారణాలు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# టిబి ముక్త్ భారత్ కోసం జోష్ టీములు చురుకుగా పనిచేయాలి





**యువత, ఎన్‌సీసీ క్యాడెట్లు కీలక పాత్ర పోషించాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, అక్టోబర్ 8 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లాను టిబి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు యువత, ఎన్‌సీసీ క్యాడెట్లు, జోష్ టీములు చురుకుగా భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిలుపునిచ్చారు. టిబి ముక్త్ భారత్--ఆయుష్మాన్ కోసం జోష్ టీముల కార్యక్రమాన్ని గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి (టిబి) బ్యాక్టీరియా వల్ల కలిగే అంటువ్యాధి అని తెలిపారు. ప్రధానంగా గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని, చికిత్స పొందని టిబి రోగులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వెలువడే సూక్ష్మక్రిముల ద్వారా ఇతరులకు వ్యాధి సంక్రమించే అవకాశం ఉందన్నారు. రెండు వారాలకు మించి తగ్గని దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు, బరువు తగ్గడం, ఆకలి తగ్గడం, నీరసం వంటి లక్షణాలను ప్రజలు నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. ఇలాంటి లక్షణాలు ఉన్న వారు సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి కఫ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అవసరమైతే వైద్యుల సూచన మేరకు ఛాతీ ఎక్స్‌రే తదితర పరీక్షలు నిర్వహించి వ్యాధిని నిర్ధారించుకోవాలని సూచించారు. టిబి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా అందించే చికిత్సను వైద్యుల సూచనల మేరకు పూర్తిగా తీసుకుంటే వ్యాధి నయం అవుతుందని కలెక్టర్ తెలిపారు. మందులను సక్రమంగా, నిర్దేశిత కాలం పాటు తీసుకోకపోతే డ్రగ్ రెసిస్టెంట్ టిబి వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డ్రగ్ రెసిస్టెంట్ టిబి ఉన్న రోగులు వైద్యుల సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ చికిత్సను పూర్తి చేయాలని సూచించారు.

**టిబి రహిత గ్రామాలే లక్ష్యం**

గ్రామీణ ప్రాంతాల్లో టిబిపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో జోష్ టీములు, ఎన్‌సీసీ క్యాడెట్లు, యువత కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాల్లో టిబి స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించి అనుమానిత కేసులను గుర్తించడం, అవసరమైన పరీక్షలు చేయించడం, వ్యాధి నిర్ధారణ అయిన వారికి చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామాన్ని టిబి రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ఎన్‌సీసీ క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు, యువత, మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రభావశీల వ్యక్తుల సహకారం తీసుకోవాలని తెలిపారు. ఆరోగ్యశాఖతో పాటు ఇతర లైన్ డిపార్ట్‌మెంట్లు సమన్వయంతో పనిచేసి వరంగల్ జిల్లాను టిబి రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయాలని కలెక్టర్ కోరారు.

**టిబి రహిత గ్రామాల సర్పంచులకు సన్మానం**

టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో టిబి రహిత గ్రామాలుగా గుర్తింపు పొందిన గ్రామాల సర్పంచులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి శాలువాలతో సత్కరించి, టిబి ముక్త్ భారత్ గ్రామాల సర్టిఫికెట్లను అందజేశారు. చాపలబండ గ్రామ సర్పంచ్ ఆలేటి పశు, దేశాయిపల్లి సర్పంచ్ ఉత్తరేణి భాగ్యలక్ష్మి, చెన్నారం సర్పంచ్ సింధం లలిత, కాశిగూడెం సర్పంచ్ పటాన్ రాజాక్, లోహిత గ్రామ సర్పంచ్ బొమ్మ నాగేష్, నల్లబెల్లి గ్రామ సర్పంచ్ జక్క అనిత తరపున ఎంపీడీవో వెంకట రమణ సర్టిఫికెట్లు అందుకున్నారు. అనంతరం టిబి నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యా రాణి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఐ. ప్రకాష్, డాక్టర్ ఆర్. రాజమౌళి, డాక్టర్ సాజిదా అతహరి, డాక్టర్ అరుణ్ జోషి, డిప్యూటీ డెమో ఎస్. వెంకటేశ్వర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, టిబి రహిత గ్రామాల సర్పంచులు, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎన్‌సీసీ కమాండర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు, విద్యార్థులు, టిబి విభాగ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సామ్, మామ్ కేసులు లేని జిల్లాగా హనుమకొండను తీర్చిదిద్దడమే లక్ష్యం





**అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం, బాలల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**పరకాల, అక్టోబర్ 8 (జై భీమ్ న్యూస్)**

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం, బాలల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని, జిల్లాలో సామ్, మామ్ కేసులను పూర్తిగా నిర్మూలించి సామ్, మామ్ కేసులు లేని జిల్లాగా హనుమకొండను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. పరకాలలోని ఆర్.ఆర్. గార్డెన్స్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసం ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం, తల్లిపాల ప్రాముఖ్యత, బాలల ఆరోగ్యంపై ప్రజల్లో గణనీయమైన అవగాహన పెరిగిందన్నారు. గతంలో పిల్లలకు కేవలం అన్నం తినిపించడంపైనే ఎక్కువగా దృష్టి ఉండేదని, ప్రస్తుతం కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, పప్పులు తదితర వివిధ రకాల పోషకాహారం అందించాల్సిన అవసరంపై ప్రజల్లో అవగాహన పెరిగిందన్నారు. ఈ మార్పు అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న నిరంతర కృషి ఫలితమేనని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో చిన్నచిన్న మార్పుల ద్వారా ఆహారంలో పోషక వైవిధ్యాన్ని పెంచాలని, ఆకుకూరలు, ఇతర పోషక పదార్థాలను ఆహారంలో భాగం చేయడం ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనతను నివారించడంతో పాటు వారి సమగ్ర ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చన్నారు. ప్రస్తుతం జిల్లాలో సామ్, మామ్ పిల్లల సంఖ్య గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గిందని, అయినప్పటికీ ఒక్క సామ్ కేసు కూడా జిల్లాలో ఉండకూడదనే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్న సామ్ పిల్లలను పూర్తిగా గుర్తించి వారికి అవసరమైన పోషకాహారం, వైద్య సేవలు అందించేందుకు అంగన్‌వాడీ సిబ్బంది, సూపర్‌వైజర్లు, సీడీపీఓలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. సామ్, మామ్ పిల్లల తల్లిదండ్రులకు నిరంతరం కౌన్సెలింగ్ అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతాన్ని నేరుగా అందించడంతో పాటు పిల్లలకు ఇష్టమైన విధంగా లడ్డూలు, కేకులు తదితర రూపాల్లో తయారు చేసి అందించడం ద్వారా పోషకాహారం పట్ల పిల్లల్లో ఆసక్తిని పెంచాలని అన్నారు. గర్భం దాల్చిన నాటి నుంచి చిన్నారికి రెండేళ్ల వయస్సు వచ్చే వరకు ఉండే తొలి వెయ్యి రోజులు అత్యంత కీలకమైనవని కలెక్టర్ తెలిపారు. ఈ కాలంలో తల్లి, శిశువుకు అవసరమైన పోషకాహారం అందించడంతో పాటు ఆరోగ్యం, ఎదుగుదల, మానసిక వికాసంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న పుస్తకాలు, బోధనా సామగ్రి, రోజువారీ, నెలవారీ కార్యకలాపాల ప్రణాళికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. చిన్నారుల తొలి దశలో జరిగే మెదడు అభివృద్ధి వారి భవిష్యత్ విద్య, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసంపై దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతుందని, అందువల్ల పోషకాహారానికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో బాలల విద్య, మేధో వికాసానికి కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. బాలల ఆరోగ్యం, పోషకాహారం కేవలం ఒక శాఖకు సంబంధించిన అంశం కాదని, పంచాయతీరాజ్, పారిశుద్ధ్యం, వైద్య ఆరోగ్య శాఖ, ఏఎన్ఎంలు తదితర శాఖలతో సమన్వయం అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. బాలలు, తల్లుల పోషకాహారం, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, టీకాలు, గర్భిణీల ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలను సమగ్రంగా చూడాలని సూచించారు. ప్రతి గ్రామంలో నెలకు ఒకసారి విలేజ్ హెల్త్, శానిటేషన్ అండ్ న్యూట్రిషన్ డే కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించి గ్రామంలో నెలకొన్న సమస్యలు, పారిశుద్ధ్య పరిస్థితులు, పిల్లల టీకాల పరిస్థితి, గర్భిణీలకు నిర్వహించే వివిధ పరీక్షలు, పోషకాహార లోపం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించాలని అన్నారు. అవసరమైన సందర్భాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను కూడా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గత కొన్ని రోజులుగా వివిధ స్థాయిల్లో చురుకుగా మహిళా శిశు సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరింత సమర్థవంతంగా ముందుకు సాగాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల నమోదు, పనితీరు మెరుగ్గా ఉండటంతో పాటు పోషణ మాసం సందర్భంగా వివిధ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. పోషకాహార లోపం నుంచి చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, మహిళలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రతిజ్ఞ చేయించారు. పోషణపై అవగాహన కల్పించడంలో భాగంగా సామూహిక శ్రీమంతాలు, అక్షరాభ్యాసాలు, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దకోడేపాక గ్రామానికి చెందిన ఏడు నెలల చిన్నారి మహాను కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఎత్తుకొని అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. పరకాల మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న సేవలు ఎంతో గొప్పవని పేర్కొన్నారు. ఇదే విధంగా సేవలను కొనసాగిస్తూ పిల్లలు, సమాజ అభివృద్ధికి మరింత సహకారం అందించాలని కోరారు. పరకాల ఆర్డీవో డీఎస్. వెంకన్న మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నామని, లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఏకు దివ్య, కౌన్సిలర్ బొచ్చు శ్యామల, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి విశ్వజ, ఎంపీడీవో రామకృష్ణ, తహసీల్దార్ విజయలక్ష్మి, మెడికల్ ఆఫీసర్ దివ్య, సీడీపీఓలు స్వరూప, స్వాతి, సింధూజ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అరెస్టు కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి పరాకాష్ట






**మాజీ మంత్రి కొండా సురేఖ**

**వరంగల్, 8 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను కోరుతూ వరంగల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. వరంగల్ చౌరస్తా నుంచి పోచమ్మ మైదాన్ జంక్షన్ వరకు సాగిన పాదయాత్రలో మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం పోచమ్మ మైదాన్ జంక్షన్‌లో రాణి రుద్రమదేవి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని అన్నారు. ఓటు చోరీ, ఎన్నికల అక్రమాలపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ వ్యవహారశైలిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రాజీనామా చేయాలని కోరారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగి ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని అన్నారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం ప్రశ్నించినందుకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అదుపులోకి తీసుకోవడం సరైన విధానం కాదని, ఇది కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి పరాకాష్ట అని కొండా సురేఖ విమర్శించారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని ఆమె తెలిపారు.

# సీకేఎం డిగ్రీ కళాశాలలో..
# ఘనంగా బతుకమ్మ సంబరాలు

**బతుకమ్మ పాటలతో మార్మోగిన కళాశాల ప్రాంగణం..**
**ఉత్సాహంగా పాల్గొన్న వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయేషా విద్యార్థినీ విద్యార్థులు**




**వరంగల్, 8 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్‌లో చరిత్ర కలిగిన, ఎంతోమంది మేధావులను తీర్చిదిద్దిన సీకేఎం డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రాంగణం బతుకమ్మ పాటలు, పండుగ సందడితో కళకళలాడింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆయేషా ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాలలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడటంతో కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆయేషా మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ ప్రజల జీవన విధానం, సంస్కృతి, ప్రకృతితో ముడిపడిన గొప్ప పండుగ అని వివరించారు. పూలను పూజిస్తూ, మహిళలు, యువతులు ఆనందోత్సాహాలతో జరుపుకునే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రత్యేకతను ప్రపంచానికి చాటిచెబుతోందన్నారు. విద్యార్థులు పండుగల ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడంతో పాటు వాటిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం డాక్టర్ వసుధ విద్యార్థినీ విద్యార్థులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే దసరా పండుగను పురస్కరించుకుని ముందస్తు దసరా శుభాకాంక్షలు కూడా తెలియజేశారు. విద్యార్థులు విద్యతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు. బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ, బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు కలిసి వేడుకలను నిర్వహించడంతో కళాశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. కార్యక్రమంలో కళాశాల సూపరింటెండెంట్ శ్రీనివాస్, అకౌంటెంట్ జ్ఞానేశ్వర్, అధ్యాపకులు, రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవ సంబంధాలు, విలువల విధ్వంసంపై విద్యార్థులు ఆలోచించాలి

**బాలగోపాల్ రచనలు నేటి తరానికి దిక్సూచి**
**ప్రొఫెసర్ జి. హరగోపాల్**

**వరంగల్, 8 అక్టోబర్ 2026 (భీమ్ న్యూస్)**

మానవ సంబంధాలు, విలువలు క్రమంగా ఎలా క్షీణిస్తున్నాయో విద్యార్థులు ఆలోచించాలని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ జి. హరగోపాల్ అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం సెనెట్ హాల్‌లో నిర్వహించిన డాక్టర్ కే. బాలగోపాల్ 16వ స్మారక ఉపన్యాసంలో "బాలగోపాల్ రచనల ప్రాసంగికత" పై ఆయన ప్రసంగించారు. బాలగోపాల్ న్యాయం, సమానత్వం, మానవ హక్కుల కోసం జీవితాంతం కృషి చేశారని తెలిపారు. ఆయన రచనలు నేటి సామాజిక పరిస్థితుల్లోనూ ఎంతో ప్రాసంగికమని, విద్యార్థులు వాటిని చదవడంతో పాటు ఆలోచనలను ఆచరణలో పెట్టాలని సూచించారు. సమాజానికి తాను ఏమి చేయగలననే బాధ్యత ప్రతి విద్యార్థిలో ఉండాలన్నారు. హెచ్‌ఆర్‌ఎఫ్ కార్యకర్త తాల్లా రోహిత్ మాట్లాడుతూ, మానవ హక్కుల పరిరక్షణకు నాలుగు దశాబ్దాల క్రితమే బాలగోపాల్ బలమైన పునాది వేశారని అన్నారు. సంక్షేమం ప్రజల హక్కు అనే భావనను ఆయన రచనల ద్వారా చాటారని పేర్కొన్నారు. వైస్‌ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, బాలగోపాల్ నేటి తరానికి ఆదర్శప్రాయుడని, ఆయన పేరుతో 16 స్మారక ఉపన్యాసాలు నిర్వహించడం గర్వకారణమన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం బాలగోపాల్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. అనంతరం "నిత్య జీవితంలో మానవ హక్కులు" పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాలగోపాల్ సతీమణి వసంత లక్ష్మి, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## బయోటెక్నాలజీతో వ్యవసాయం, ఆరోగ్యం, ఔషధ రంగాల్లో నూతన అవకాశాలు



**వరంగల్, 8 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

ఆధునిక బయోటెక్నాలజీతో వ్యవసాయం, ఆరోగ్యం, ఔషధ రంగాల్లో అనేక నూతన అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని యూజీసీ కోఆర్డినేటర్, నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఆర్. మల్లికార్జున్ రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం జీవసాంకేతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 7, 8 తేదీల్లో సెనెట్ హాల్‌లో నిర్వహించిన "ఆధునిక బయోటెక్నాలజీ: సవాళ్లు మరియు అవకాశాలు" అనే రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ప్రొఫెసర్ ఆర్. మల్లికార్జున్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా, ప్రొఫెసర్ ఎస్. రామ్ రెడ్డి అధ్యక్షత వహించారు. ముగింపు రోజున ఢిల్లీ విశ్వవిద్యాలయం సౌత్ క్యాంపస్ మాజీ ప్రొఫెసర్, జెనెటిక్స్ విభాగం మాజీ అధిపతి ప్రొఫెసర్ ఎం.వి. రాజం "పంటల అభివృద్ధి: సంప్రదాయ సంతానోత్పత్తి నుంచి జీనోమ్ ఎడిటింగ్ వరకు" అనే అంశంపై ప్రసంగించారు. సదస్సులో స్టెమ్ సెల్స్, బయోమెటీరియల్స్, క్యాన్సర్ చికిత్స, వన్ హెల్త్, వెక్టర్ ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణ, సాలిడ్ స్టేట్ ఫెర్మెంటేషన్, సెరికల్చర్, ఔషధ మొక్కలు, బయోలాజిక్స్, నానోమెడిసిన్, ప్రెసిషన్ థెరప్యూటిక్స్ తదితర ఆధునిక అంశాలపై నిపుణులు తమ పరిశోధనలు, అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సదస్సు ద్వారా వ్యవసాయం, ఆరోగ్యం, ఔషధాలు, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో బయోటెక్నాలజీ ప్రాధాన్యత, తాజా పరిశోధనలు, భవిష్యత్ అవకాశాలపై శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యార్థులకు అవగాహన కలిగింది. కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్

**నాణ్యతలో రాజీ లేకుండా నిర్మాణ పనులు చేపట్టాలి: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**





**వర్ధన్నపేట, అక్టోబర్ 8 (జై భీమ్ న్యూస్)**

గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా పూర్తి చేయాలని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అధికారులను ఆదేశించారు. వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి క్రాస్ వద్ద సుమారు 16 ఎకరాల 11 గుంటల విస్తీర్ణంలో రూ.200 కోట్ల బడ్జెట్‌తో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ ప్రాంగణాన్ని గురువారం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతిని సంబంధిత అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి సమీక్షించారు. పాఠశాల నిర్మాణానికి సంబంధించిన ప్రణాళిక, భవన నిర్మాణ పనులు, మౌలిక వసతులు, విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులను ఎమ్మెల్యే వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత ప్రణాళిక ప్రకారం నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు ఆధునిక తరగతి గదులు, అవసరమైన మౌలిక వసతులు, అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉండేలా పాఠశాల నిర్మాణాన్ని చేపట్టాలని తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు సంబంధించిన అంశాన్ని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి పాఠశాల నిర్మాణానికి అవసరమైన భూమిని కేటాయించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యారంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కూడా అత్యుత్తమ విద్యా ప్రమాణాలు, ఆధునిక విద్యా వసతులు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో ఎక్కడా నాణ్యతా లోపాలు తలెత్తకుండా నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చోట సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ అందుబాటులోకి వస్తే వర్ధన్నపేట నియోజకవర్గంలోని విద్యార్థులకు ఆధునిక విద్యా వసతులు మరింత చేరువ అవుతాయని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

**మత్తు పదార్థాలు తీసుకోవడం, కొనడం, అమ్మడం చట్టరీత్యా నేరం**




**హనుమకొండ, 8 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

మత్తు పదార్థాలు తీసుకోవడం, కొనడం, అమ్మడం, అధికంగా మద్యం సేవించడం చట్టరీత్యా నేరమని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, జడ్జి వెంకట హైమ పూజిత, నార్కోటిక్స్ డిపార్ట్మెంట్ యాంటీ డ్రగ్ కమిటీ సభ్యురాలు, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ హనుమకొండ ఆధ్వర్యంలో నిర్వహించిన యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా వారు హనుమకొండలోని హెల్పింగ్ హ్యాండ్ డీ-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న వారిని ఆత్మీయంగా పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సెంటర్ నిర్వాహకులు రాము నుంచి చికిత్సకు వచ్చే వారి వివరాలు, వారికి అందిస్తున్న కౌన్సెలింగ్, వైద్య చికిత్స, చికిత్స అనంతరం నిర్వహిస్తున్న ఫాలోఅప్ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ మత్తు పదార్థాల దుర్వినియోగం వల్ల ఎంతో మంది తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, అపరిచితుల ప్రలోభాలకు లోనై మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం, దుర్వినియోగానికి సంబంధించిన చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీస్ 100కు, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ లేదా నార్కోటిక్స్ డిపార్ట్మెంట్‌కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు రాము, అడ్వకేట్ రవి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# ఓటు హక్కు ఉన్నవారు.. ఓటు చోరీకి గురైనవారు

**దేశాన్ని రెండు వర్గాలుగా విభజిస్తున్నారు: రేవంత్‌రెడ్డి**
**పేదల ఓట్లు తొలగించేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపణ**
**ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలో పాల్గొన్న తెలంగాణ సీఎం**
**13 కోట్ల ఓట్లు తొలగిస్తే ప్రపంచంలోనే అతిపెద్ద హక్కుల హరణం**
**ఓట్ల తర్వాత రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులకూ ముప్పు: హెచ్చరిక**

**హైదరాబాద్, అక్టోబర్ 9 (జై భీమ్ న్యూస్) :**

దేశంలో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైనవారు అంటూ రెండు వర్గాలను సృష్టిస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటమి భయంతోనే పేదల ఓటు హక్కును హరించేందుకు ఆ పార్టీ కుట్ర చేస్తోందని విమర్శించారు. పేదలు, దళితులు, గిరిజనులు, ఇతర వెనుకబడిన తరగతులు, మైనారిటీలు బీజేపీకి వ్యతిరేకంగా మారుతున్నారనే భయంతో వారి ఓట్లను తొలగించాలని చూస్తోందని ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన నిరసనలో రేవంత్‌రెడ్డి వరుసగా రెండో రోజు పాల్గొన్నారు. గురువారం రాజ్‌ఘాట్ వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఇతర కూటమి నేతలతో కలిసి ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో ప్రజలను విభజించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. సుమారు 13 కోట్ల మంది పౌరుల ఓట్లను తొలగిస్తే ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణ ప్రక్రియ అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 1952 నుంచి జరిగిన ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య పెరుగుతూ వచ్చిందని, ఇప్పుడు రాబోయే ఎన్నికల నాటికి మొత్తం ఓటర్ల సంఖ్య తగ్గే పరిస్థితిని సృష్టిస్తున్నారని విమర్శించారు. ఈ పోరాటం కాంగ్రెస్ లేదా ఇండియా కూటమికి మాత్రమే పరిమితమైనది కాదని, దేశ భవిష్యత్తుకు సంబంధించినదని పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కును తొలగిస్తే భవిష్యత్తులో రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులకు కూడా ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించి, ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ రాజకీయంగా తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు.

# ఎమ్మెల్యే వీడియో వివాదం.. షేర్ చేసిన వారిపై కేసు

**హైదరాబాద్, అక్టోబర్ 8 (జై భీమ్ న్యూస్) :**

ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి బస్సు ప్రయాణ సమయంలో ఓ విద్యార్థినితో వ్యవహరించిన తీరుపై వివాదం నెలకొంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్యే ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వీడియోను ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ఇబ్రహీంపట్నం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వి. సికిందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలుతీరును పరిశీలించేందుకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అక్టోబర్ 6న ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణిస్తున్న టీజీఎస్‌ఆర్టీసీ బస్సు ఎక్కారు. ఈ సందర్భంగా ఓ కళాశాల విద్యార్థినితో మాట్లాడగా, పథకం వల్ల ఏడాదికి సుమారు రూ.45 వేల వరకు ఆదా అవుతోందని ఆమె తెలిపినట్లు కథనంలో పేర్కొన్నారు. ఈ సంభాషణ సమయంలో ఎమ్మెల్యే చేయి విద్యార్థినికి తగిలిన దృశ్యాలు వీడియోలో కనిపించడంతో వివాదం మొదలైంది. వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలోకి రావడంతో విమర్శలు వ్యక్తమయ్యాయి. దీనిపై స్పందించిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సికిందర్‌రెడ్డి, బస్సు మలుపు తిరుగుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ ఎమ్మెల్యే చేయి విద్యార్థినికి తగిలిందని వివరణ ఇచ్చారు. ఈ ఘటనను బీఆర్‌ఎస్ నాయకులు ఉద్దేశపూర్వకంగా వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఈ ప్రయత్నం జరుగుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ఆధారంగా పరువుకు భంగం కలిగించే ప్రచారం, ఫోర్జరీ, ప్రజా శాంతికి విఘాతం కలిగించే చర్యలకు సంబంధించిన అభియోగాలతో పాటు ఐటీ చట్టంలోని సెక్షన్ 67 కింద పోలీసులు కేసు నమోదు చేసినట్లు కథనం తెలిపింది. ఘటనపై వచ్చిన ఆరోపణలు, యూత్ కాంగ్రెస్ వివరణ నేపథ్యంలో పోలీసుల దర్యాప్తులో వెలువడే వివరాలు కీలకం కానున్నాయి.

# జూరాల నీళ్లు వదిలిన రైతులపై కేసులు

**వనపర్తి, అక్టోబర్ 8 (జై భీమ్ న్యూస్) :**

జూరాల ప్రాజెక్టు కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేసుకున్న 14 మంది రైతులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వనపర్తి జిల్లా అమరచింత పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. సాగునీటి పారుదల శాఖ డిప్యూటీ ఇంజినీర్ (డీఈ) ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అమరచింత ఎస్సై స్వాతి గురువారం వెల్లడించారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు గత కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందన లేకపోవడంతో సెప్టెంబర్ 19వ తేదీ సాయంత్రం రైతులు జూరాల ప్రాజెక్టు వద్దకు చేరుకుని గేట్లు ఎత్తి కాలువ ద్వారా తమ పొలాలకు నీటిని విడుదల చేసుకున్నట్లు సమాచారం. సెప్టెంబర్ 19, 20 తేదీల్లో జరిగిన ఈ పరిణామాలపై ఇరిగేషన్ డీఈ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా రైతులపై చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఇదే వ్యవహారంలో సాగునీటి కోసం నిరసన తెలిపిన రాజకీయ నాయకులపైనా కేసులు నమోదయ్యాయి. జూరాల ప్రాజెక్టు నుంచి తక్షణమే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 21న జమ్మిచేడు వద్ద ధర్నా నిర్వహించిన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులపై కూడా కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఒకవైపు సాగునీరు అందక పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తుండగా, మరోవైపు నీటిని విడుదల చేసుకున్న ఘటనపై కేసులు నమోదు కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

# రైతు అభివృద్ధే దేశాభివృద్ధి






**కమలాపూర్‌లో ఘనంగా మెగా కిసాన్ మేళా-2026**

**కమలాపూర్, అక్టోబర్ 8 (జై భీమ్ న్యూస్)**

రైతుల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. రైతులు, వ్యవసాయ అధికారులు, విద్యార్థులు, సాంకేతిక నిపుణులు, ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఎస్‌ఆర్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఆధ్వర్యంలో ఆర్‌ఏడబ్ల్యూఈ ఫైనల్ ఇయర్ బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు నిర్వహించిన మెగా కిసాన్ మేళా--2026 కమలాపూర్ రైతు వేదికలో ఘనంగా జరిగింది. 'స్మార్ట్ ఫార్మింగ్--సస్టైనబుల్ ఫ్యూచర్' అనే థీమ్‌తో, 'కనెక్టింగ్ ఫార్మర్స్, నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ' అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రైతులు, అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ పి. ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ రైతులు లేకపోతే మన జీవితం లేదని, ప్రతి ఒక్కరి జీవనానికి అన్నదాతే ప్రధాన ఆధారమని అన్నారు. రైతు పండించే ప్రతి గింజ వెనుక ఎంతో శ్రమ, కష్టం, అంకితభావం దాగి ఉంటుందని పేర్కొంటూ రైతుల సేవలను కొనియాడారు. వ్యవసాయాన్ని కేవలం ఒక వృత్తిగా కాకుండా సమాజానికి జీవనాధారంగా చూడాలని, రైతుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవభావంతో ఉండాలని సూచించారు. వ్యవసాయ విద్యను ఎంచుకున్న బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులను అభినందించిన ఆయన, భవిష్యత్తులో వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లే బాధ్యత యువతపై ఉందన్నారు. విద్యార్థులు క్షేత్రస్థాయిలో రైతులతో మమేకమై వారి సమస్యలను అర్థం చేసుకుని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ సర్పంచ్ పి. సతీష్, ఏవో వేణు, ఏఈవో రహీం, జిల్లా వ్యవసాయ అధికారి వి. విజయ్ చంద్ర, ఏడీఏ డి. ఆది రెడ్డి, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి. ఝాన్సీ రాణి, యూత్ ఐకాన్ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్‌ఏడబ్ల్యూఈ విద్యార్థులు ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శనలు, ఇన్నోవేషన్ స్టాళ్లు మేళాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు, స్మార్ట్ ఫార్మింగ్, స్థానిక ఉత్పత్తులు, విలువ ఆధారిత ఉత్పత్తులు, రైతులకు ఉపయోగపడే వివిధ వ్యవసాయ పద్ధతులను విద్యార్థులు ప్రదర్శించి, వాటి ప్రయోజనాలను రైతులకు వివరించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు అవలంబించాల్సిన శాస్త్రీయ పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఆర్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ డీన్ డా. జి. భూపాల్ రాజ్ మాట్లాడుతూ రైతుల సమస్యలను విద్యార్థులు క్షేత్రస్థాయిలో అర్థం చేసుకోవడం, వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేయడం, రైతులు--విద్యార్థులు--వ్యవసాయ అధికారుల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడం మెగా కిసాన్ మేళా ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. రైతుల అనుభవాలు, విద్యార్థుల విద్యా పరిజ్ఞానం, అధికారుల సూచనలు ఒకే వేదికపైకి రావడం ద్వారా వ్యవసాయ రంగానికి మరింత ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఈ మేళాలో కమలాపూర్, మడిపల్లి, ఉనికిచెర్ల, సోమిడి, గూడూరు, గట్లనర్సింగాపూర్, దామెర, శ్రీరాములపల్లి, బావుపేట, గుంటూరుపల్లి గ్రామాలకు చెందిన ఆర్‌ఏడబ్ల్యూఈ విద్యార్థులు పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో రైతులతో కలిసి పనిచేస్తూ పొందిన క్షేత్రస్థాయి అనుభవాలను విద్యార్థులు ఈ కార్యక్రమంలో పంచుకున్నారు. రైతులకు ఉపయోగపడే సాంకేతికతను గ్రామీణ స్థాయికి తీసుకెళ్లడం, వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులపై రైతులకు అవగాహన కల్పించడం, యువతను వ్యవసాయం వైపు ప్రోత్సహించడం వంటి అంశాలకు మేళా ప్రాధాన్యతనిచ్చింది. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన రైతులు, విద్యార్థులు, ప్రభుత్వ అధికారులు, ఎస్‌ఆర్ యూనివర్సిటీ యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది, స్పాన్సర్లకు ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డా. జి. భార్గవి, సాయి కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. రైతు అభివృద్ధి, ఆధునిక వ్యవసాయ సాంకేతికత, యువత భాగస్వామ్యం, స్థిరమైన వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించిన మెగా కిసాన్ మేళా--2026 రైతులు, విద్యార్థులు, అధికారులు, ప్రజల మధ్య సమన్వయానికి వేదికగా నిలిచింది.

# సైబర్ నేరాల నియంత్రణలో వరంగల్ కమిషనరేట్ ప్రత్యేక చర్యలు

**9 నెలల్లో 3,952 ఫిర్యాదులు.. ?5.23 కోట్ల నగదు బాధితులకు తిరిగి**
**174 మంది సైబర్ నిందితుల అరెస్ట్.. సెప్టెంబర్‌లో 34 మంది అరెస్ట్**

**వరంగల్, అక్టోబర్ 8 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు సత్వర సహాయం అందించడం, మోసపోయిన నగదును రికవరీ చేయడం, సైబర్ నేరస్థులను గుర్తించి అరెస్ట్ చేయడంతో పాటు ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన కల్పించేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా సైబర్ నేరాలకు సంబంధించిన నెలవారీ పనితీరు నివేదికలను ఇకపై ప్రతి నెలా మీడియా ద్వారా విడుదల చేయనున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. 2026 జనవరి 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్.సి.ఆర్.పి) ద్వారా వరంగల్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 3,952 ఫిర్యాదులు అందగా, వాటిలో 1,155 ఫిర్యాదులను పరిష్కరించారు. సైబర్ నేరాలకు సంబంధించి 105 కేసులను గుర్తించి 174 మంది నిందితులను అరెస్ట్ చేశారు. మిగిలిన ఫిర్యాదులపై తదుపరి చర్యలు కొనసాగుతున్నాయి. ఎన్.సి.ఆర్.పి గణాంకాల ప్రకారం సైబర్ నేరాల కారణంగా బాధితులు సుమారు ?20.66 కోట్ల మేర నష్టపోగా, పోలీసుల చర్యలతో ?5.23 కోట్ల నగదును బాధితులకు తిరిగి అందించారు. సమన్వయ వ్యవస్థ ద్వారా పోలీస్ స్టేషన్లకు పంపిన 983 అభ్యర్థనల్లో 866 అభ్యర్థనలను పూర్తి చేశారు. అలాగే బ్యాంకింగ్ సంబంధిత సమస్యలపై జిఆర్‌ఎం పోర్టల్ ద్వారా ప్రజలు 104 ఫిర్యాదులు నమోదు చేయగా, వాటిలో 83 ఫిర్యాదులను పరిష్కరించారు. ఎంఆర్‌ఎం ద్వారా బ్యాంకింగ్ సమస్యలకు సంబంధించి 789 అభ్యర్థనలు అందగా, 615 అభ్యర్థనలను పరిష్కరించి, ఈ ప్రక్రియ ద్వారా ?21.44 లక్షల నగదును బాధితులకు తిరిగి అందించారు. సైబర్ నేరస్థులను గుర్తించేందుకు చేపట్టిన అక్యూస్డ్ ప్రొఫైలింగ్ లో 116 అభ్యర్థనలు అందగా, వాటన్నింటినీ 100 శాతం పూర్తి చేశారు. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంచేందుకు జూన్, జూలై, ఆగస్టు నెలల్లో వరంగల్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 286 సైబర్ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. సెప్టెంబర్ 2026లో మాత్రమే ఎన్.సి.ఆర్.పి ద్వారా 483 సైబర్ ఫిర్యాదులు అందగా, 95 ఫిర్యాదులను పరిష్కరించి 10 ఎఫ్ఐఆర్ లు నమోదు చేశారు. అదే నెలలో ఎంఆర్‌ఎం ద్వారా 285 అభ్యర్థనలు అందగా, బాధితుల నగదుకు సంబంధించి ?50.87 లక్షలను రిస్టోరబుల్ అమౌంట్ గా గుర్తించి, ?49.56 లక్షలను బాధితులకు పునరుద్ధరించారు. అదేవిధంగా సైబర్ నేరాలకు పాల్పడిన 34 మంది నిందితులను సెప్టెంబర్‌లో వరంగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు కాల్ చేసి, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును సత్వరంగా నిలుపుదల చేసి బాధితులకు తిరిగి అందించే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, గుర్తుతెలియని లింకులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద యాప్‌లు, ఆన్‌లైన్ పెట్టుబడులు, బ్యాంకింగ్ వివరాలను అడిగే వ్యక్తుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు. "అప్రమత్తంగా ఉండండి -- సైబర్ నేరాల నుంచి సురక్షితంగా ఉండండి" అని వరంగల్ కమిషనరేట్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# వికారాబాద్ జిల్లా వికలాంగుల అధ్యక్షులుగా పోతురాజు సుధీర్

**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

నిన్న దోమ మండలం దాదాపూర్ రైతు వేదికలో బివిహెచ్ పి ఎస్ దోమ మండల దివ్యంగుల అధ్యక్షులుగా కుర్వ ఆంజనేయులు గా, దోమ మండల్ దివ్యంగుల ఉపాధ్యక్షులు తెలుగు వెంకటయ్య కార్యదర్శి దుద్యాల మల్లేష్ సహాయక కార్యదర్శి తర్య నాయక్ కోశాధికారి కాజా పాషా మీడియా కానవీనర్ బొశీగ్గ బాలరాజును ఎన్నుకోవడం జరిగింది. భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో, మండల అధ్యక్షునిగా కుర్వ ఆంజనేయులు ఏకగ్రీవంగా నియమితులయ్యారు భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి వికారాబాద్ జిల్లా అధ్యక్షులు పోతురాజు సుధీర్ చేతుల మీదుగా నియామక పత్రం అందించారు. అదేవిదంగా దోమ మండల నూతన అధ్యక్షులు ఆంజనేయులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరంల అవుతున్న ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం వికలాంగులకు ఇచ్చిన హామీలను ఏవో ఒకటి నెరవేర్చలేరు. వారు వెంటనే రూ. 6000 పింఛన్ పెంచాలని అర్హులైన వికలాంగుల అందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డబల్ బెడ్ రూమ్ కేటాయించాలని, అదేవిధంగా నాలుగు శాతం రిజర్వేషన్ అమలు కావాలని 2016 వికలాంగుల చట్టం కచ్చితంగా అమలు కావాలని, ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలని బ్యాంక్ లాంగ్ ఉద్యోగాలు భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ యొక్క అవకాశం నాకు ఇచ్చినందుకు దోమ మండల వికలాంగులందరికీ మరి జిల్లా అధ్యక్షులు పోతురాజు సుధీర్ మరి మిగతా సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చుక్కయ్య జిల్లా సలహాదారుడు వెంకటేష్ మీడియా కన్వీనర్ నర్సిములు. సభ్యులు వెంకటేష్ నరేష్ మొగలయ్య యాదయ్య వేరేషం తదితరులు పాల్గొన్నారు.

